




	కనిష్ఠం	గరిష్ఠం
ఖమ్మం	23.6	36
భద్రాద్రి	27	36

కటకటాల వెనక్కి టీఎన్‌జీవో నేత

- ఫోర్జరీ కేసులో అఫ్జల్‌హసన్ అరెస్ట్
- నకిలీ పత్రాలతో నివాస స్థలం రిజిస్ట్రేషన్

ఖమ్మం క్రైం, జూన్ 24: ఓ ఖాళీ నివాస స్థలానికి సంబంధించిన పత్రాలను ఫోర్జరీ చేసి రిజిస్ట్రేషన్ చేయించారన్న కేసులో టీఎన్‌జీవో ఖమ్మం జిల్లా అధ్యక్షుడు షేక్ అఫ్జల్‌హసన్‌ను ఖమ్మం టూ టౌన్ పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఖమ్మం నగరంలోని విజయనగర్ కాలనీ సర్వే నెంబర్ 303లో ఉన్న 1,420 గజాల నివాస స్థలాన్ని నకిలీ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌ను సృష్టించి అఫ్జల్‌హసన్, నౌషద్‌ఖాన్, షేక్ మైబూబ్, మేడుపల్లి నాగసురేష్ అనే వ్యక్తులు కలిసి రిజిస్ట్రేషన్ చేయించారని బ్యాంక్ కాలనీకి చెందిన ఏపూరి కోటేశ్వరి అనే మహిళ ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసి ఏ-1గా ఉన్న అఫ్జల్ హసన్‌ను సోమవారం సాయంత్రం టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం ప్రథమశ్రేణి న్యాయధికారి బిక్కం రజని ఆయనకు 14రోజుల పాటు జ్యుడీషియల్ రిమాండ్ విధించగా పోలీసులు జిల్లా జైలుకు తరలించారు. కాగా ఈ కేసులో ఉన్న నౌషద్ ఖాన్, షేక్ మైబూబ్, మేడుపల్లి నాగసురేష్ పరారీలో ఉన్నారు. ఇదిలా ఉండగా తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించిన మరో కేసులో అఫ్జల్ హసన్‌పై గతంలో కేసు నమోదు కాగా, హైకోర్టును ఆశ్రయించి ముందస్తు బెయిల్ తీసుకున్నారు. సోమవారం ఉదయం ఆయన బెయిల్ పత్రాలను ఖమ్మం టూటౌన్ పోలీసుస్టేషన్‌లో అందజేశారు. అనంతరం సాయంత్రం ఇల్లెందు క్రాస్ రోడ్డులో మరో కేసులో హసన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.

యజమాని దూషణ.. కిరాయిదారు ఆత్మహత్య

ఖమ్మం క్రైం, జూన్ 24: అద్దెకు ఉన్న ఇంటి యజమాని అవమానించాడని పురుగులమందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఖమ్మం నగరంలోని శ్రీనివాసనగర్‌లో గోళ్ల జనార్ధనరావు అనే వ్యక్తి ఇంట్లో చింతకాయల నాగరాజు(48)తన కుటుంబంతో కలిసి అద్దెకు ఉంటున్నాడు. ప్రైవేటు ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్న నాగరాజు రెండు నెలల క్రితమే కుటుంబంతో ఆ ఇంట్లోకి అద్దెకు వచ్చాడు. అయితే ప్రవర్తన సరిగా లేదంటూ.. ఇంటి యజమాని జనార్ధనరావు వారిని ఇల్లు ఖాళీ చేయాలన్నాడు. ఈ క్రమంలో సదరు ఇంటి యజమాని తన భార్యను ఉద్దేశించి అసభ్యంగా వ్యాఖ్యానించాడని ఆరోపిస్తూ నాగరాజు ఆదివారం సెల్ఫీవీడియో తీసుకుంటూ పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతి చెందాడు.

ప్రభుత్వాలు ఎన్ని నియంత్రణలు పెట్టినా నిత్యం ఎక్కడో ఒక్క చోట ఆర్థిక మోసాలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. ఎంతోమంది బాధితులుగా మారుతున్నారు. తాజాగా ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలోనూ ఓ ఆర్థిక మోసం బయటపడింది. ఎటువంటి అనుమతులు లేకుండా ఓ వ్యక్తి ఆన్‌లైన్ మనీ సర్క్యులేషన్ దందా నిర్వహించి డిపాజిట్‌దారులను నిండా ముంచాడు. 'మీ పెట్టుబడిని 200 రోజుల్లో డబుల్ చేసి చూపిస్తాం..' అని ప్రచారం చేయడంతో అందరూ అతడి మాయమాటలు నమ్మి సభ్యులుగా చేరి లక్షల్లో డబ్బు పెట్టారు. చివరకు స్కీమ్ నిర్వాహకుడు డబుల్ కాదు కదా, అసలు కూడా ఇవ్వకుండా టోపీ పెట్టేశాడు. ఇలా సుమారు రూ.100 కోట్ల వరకు వసూలు చేసినట్లుగా తెలుస్తోంది. విస్తుగొలుపుతున్న ఈ స్కామ్ వివరాల్లోకి వెళ్లితే...



ఆన్‌లైన్ స్కీమ్.. ఘరానా స్కామ్

నేలకొండపల్లి కేంద్రంగా ఆన్‌లైన్ మనీ సర్క్యులేషన్ దందా

- 200 రోజుల్లో పెట్టుబడికి రెండింతలు ఇస్తామని ప్రచారం
- అత్యాశతో పెట్టుబడులు పెట్టిన జనం
- రూ.100 కోట్ల వరకు వసూలు ?
- రెండు నెలలుగా నిలిచిపోయిన చెల్లింపులు..
- లబోదిబోమంటున్న బాధితులు.. కేసు నమోదుచేసిన పోలీసులు

నేలకొండపల్లి, జూన్ 24: ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం ముంగాపురంతండాకు చెందిన వీరన్న అనే వ్యక్తి 2023 జూన్ 18న ఎస్ ఎస్‌వీ ఆన్‌లైన్ మనీ సర్క్యులేషన్ పేరుతో ఓ సంస్థను ప్రారంభించాడు. దీనికోసం ఓ యాప్‌ను తయారు చేయించాడు. దాని ద్వారా మనీసర్క్యులేషన్ దందా ప్రారంభించాడు. తాను సీఈవోగా ఉంటూ మరో 10 మందిని మేనేజింగ్ డైరెక్టర్ (ఎం.డీ.)లుగా నియమించుకొని దందా మొదలుపెట్టాడు. వారి ద్వారా జనాన్ని ఆకట్టుకొని డిపాజిట్లు వసూలు చేయడం ప్రారంభించాడు. ఇందుకోసం ఎం.డీ.లకు ఒక్కొక్కరికి కారును బహుమతిగా ఇచ్చాడు. వారిని టూర్లకు సైతం తిప్పాడు. వీరన్న షో నమ్మిన ఎం.డీ. లు... ఆన్‌లైన్ స్కీమ్‌ను విస్తృతంగా ప్రచారం చేశారు. ఇలా జనం నుంచి సుమారు రూ. 100 కోట్ల వరకు డిపాజిట్లు జమఅయినట్లు సమాచారం. ఇతడి కంపెనీలో ప్రస్తుతం సుమారు 3వేల మంది వరకు సభ్యులున్నాట్లు సమాచారం.

ఏమిటీ స్కీము...?

కంపెనీలో చేరటానికి సభ్యత్వ ఎలాంటి రుసుం లేదు. వ్యాపారం చేయటానికి రూ.5వేలకు తక్కువ కాకుండా పెట్టుబడి పెట్టాలి. దీంట్లో రెండు స్కీంలున్నాయి. సెల్ఫ్ ఆర్వోఐ(రిటర్న్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్) ఇన్‌కమ్, లెవల్ ఆర్వోఐ ఇన్‌కమ్. వీటిలో పెట్టుబడి పెడితే దానిపై 1శాతం చొప్పున ప్రతీ రోజు 200 రోజుల పాటు చెల్లిస్తారు. ఈ లెక్కన పెట్టిన పెట్టుబడి 200 రోజుల్లోనే డబుల్ అవుతుందట. ఉదాహరణకు ఒక వ్యక్తి రూ.లక్ష రూపాయలు పెట్టుబడి పెడితే 1శాతం చొప్పున రోజుకు రూ.1000 రూపాయలు చెల్లిస్తారు. ఇలా 200 రోజులకు మొత్తం రూ.2లక్షలు చెల్లిస్తారు. ఇదీ వీరన్న స్కీమ్. కనీసం రూ.5000 నుంచి ఎంతవరకైనా పెట్టుబడి పెట్టవచ్చని నమ్మించారు. ఒక్కొక్కరు ఎన్ని పెట్టుబడులైనా పెట్టుకోవచ్చు. పెట్టుబడిన ఐ.డీ. పేరుతో పిలుస్తారు. కంపెనీ ప్రారంభించిన ఆర్నెల్లకే ఐడీల సంఖ్య 10,581కి చేరిందని కంపెనీ సీఈఓ నమ్మబలికాడు. తాము పెట్టిన పెట్టుబడిలో 1శాతం చొప్పున ప్రతీ రోజూ తిరిగి వస్తుండటం, 200 రోజుల పాటు వచ్చే ఆదాయం డబుల్ అవుతుండటంతో జనం అత్యాశతో పెట్టుబడులు పెట్టినట్లు తెలుస్తోంది. గత డిసెంబరులో ఒక్క క్రిస్మస్ రోజునే సుమారు రూ.29 లక్షలు డిపాజిట్ చేయించారంటే దందా ఏ స్థాయిలో జరిగిందో అర్థం చేసుకోవచ్చు. 2024 డిసెంబర్ వరకు రూ.100కోట్ల టర్నోవర్ దాటాలని సీఈఓ కొద్ది నెలల కిందట సభ్యుల సమావేశంలో పేర్కొనటం గమనార్హం. రోజుకు రూ.కోటి రావాలనేది టార్గెట్.

అనుమతులు వస్తాయట..

అసలు ఈ వ్యాపారం చేయడానికి సదరు సంస్థకు అనుమతులు లేవు. ఎవరైనా దీనిపై ప్రశ్నిస్తే "అనుమతుల కోసం దరఖాస్తు చేశాం.. అనుమతులు రావాల్సి ఉంది" అని సీఈవో నుంచి సమాధానం వస్తుంది. ఆరు నెలల్లో రూపాయికి.. రూపాయి రావటం సాధ్యమేనా? పెట్టిన పెట్టుబడులు 200 రోజుల్లో రెట్టింపు ఎలా అవుతాయన్న ప్రశ్నకు సీఈవో నుంచి ఎటువంటి సమాధానం లేదు. షేర్ మార్కెట్లో పెడుతున్నాం.. (మిగతా 6వ పేజీలో)

కేఎంసీ కమిషనర్‌గా అభిషేక్ అగస్త్య



ఖమ్మం, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ (కేఎంసీ)కమిషనర్‌గా ఐఏఎస్ అధికారి అభిషేక్ అగస్త్యను నియమిస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన మేడ్చల్ మల్కాజ్‌గిరి స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. 2020 బ్యాచ్‌కు చెందిన అభిషేక్ అగస్త్య స్వస్థలం జమ్మూ కాశ్మీర్ నుంచి 20 కి.మీ. దూరంలో ఉన్న బోర్డర్ ప్రాంతం అయిన ఆర్ ఎస్ పుర. ఆయన పాఠశాలలో విద్యార్థి దశ నుంచి ఇంటర్మీడియట్ వరకు అక్కడే చదవగా.. 2014లో శ్రీనగర్ ఎన్ఐటీలో కంప్యూటర్ సైన్స్‌లో ఇంజనీరింగ్ పూర్తి చేశారు. ఆయన తండ్రి ప్రభుత్వ లెక్చరర్, తల్లి ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా పనిచేసేవారు. బీటెక్ నాల్గవ సంవత్సరంలోనే సివిల్ సర్వీస్ కు వెళ్లాలని నిర్ణయించుకోగా.. ఐదోసారి ఆయన యూపీఎస్సీలో మంచి ర్యాంకు సాధించారు. 2018లో నాల్గవసారి యూపీఎస్సీలో ఆల్‌ఇండియా 268 ర్యాంకు సాధించగా.. ఐదోసారి 2019లో ఆల్‌ఇండియా 38వ ర్యాంకు పొందారు. ఆయన మహబూబాబాద్ జిల్లాలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్‌గా, భారత ప్రభుత్వ అసిస్టెంట్ సెక్రటరీగా పనిచేశారు. మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లాలో 2022 నవంబరు9న స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. కాగా ఆగస్త్య మంగళవారం విధుల్లో చేరనున్నారు.

ఐటీడీఏ పీవోగా బి.రాహుల్

- రేపు బాధ్యతల స్వీకరణ



భద్రాచలం, జూన్ 24: భద్రాచలం సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) ప్రాజెక్టు అధికారిగా బి.రాహుల్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 44 మంది ఐఏఎస్, ఐఎఫ్ఎస్, ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం జీవో జారీ చేసింది. ఇందులో మంచిర్యాల అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలకు)గా బాధ్యతలు నిర్వహిస్తున్న 2020 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన బి.రాహుల్‌ను భద్రాచలం ఐటీడీఏ పీవోగా నియమించారు. ఇప్పటి వరకు భద్రాచలం ఐటీడీఏ పీవోగా పనిచేసిన ప్రతీక్‌జైన్ ఇటీవల వికారాబాద్ కలెక్టరుగా బదిలీపై వెళ్లారు. దీంతో భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఐటీడీఏ పీవోగా ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తాజాగా ప్రభుత్వం పూర్తిస్థాయి పీవోను నియమించింది.

నాటి కలెక్టర్ ఉషారాణి స్ఫూర్తితో..

రాహుల్ 1994 ఆగస్టు 19న నారాయణపేటలో జన్మించారు. ఆయన తండ్రి పీఈటీగా చేసి ఉద్యోగ విరమణ చేశారు. తల్లి హిందీ పండిట్‌గా పనిచేస్తున్నారు. 8వ తరగతి చదువుతున్న సమయంలో జిల్లాస్థాయిలో వక్తృత్వ పోటీలో ద్వితీయ స్థానం సాధించారు. ఆ సమయంలో ముఖ్య అతిథిగా వచ్చిన అప్పటి మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ ఉషారాణి ప్రసంగంతో స్ఫూర్తి పొంది తానూ కలెక్టర్ కావాలని లక్ష్యం పెట్టుకున్నారు. పదో తరగతి వరకు దయానంద్ విద్యామందిర్‌లో, ఇంటర్ హైదరాబాద్‌లో చదివారు. వరంగల్ ఎన్ఐటీలో ఈఈఈ విభాగంలో ఇంజనీరింగ్ పూర్తి చేశారు. అనంతరం హైదరాబాద్‌లో క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో ఓ ప్రైవేటు కంపెనీలో నాలుగేళ్లు ఉద్యోగం చేశారు. ఈ సమయంలో ఎన్‌పీడీసీఎల్‌లో ఏఈగా అవకాశం రావడంతో 2016లో చేరారు. తన మిత్రుడు యశ్వంత్ సూచనతో ఎన్‌పీడీసీఎల్‌లో ఏఈ ఉద్యోగానికి రెండేళ్లు సెలవు పెట్టి ఢిల్లీలో 2018 ఆగస్టు నుంచి 13నెలల పాటు సివిల్స్‌కు కోచింగ్ తీసుకున్నారు. 2019లో పరీక్ష రాసి తొలిసారే సివిల్స్‌కు ఎంపికయ్యారు. సివిల్స్‌లో ఆయనకు 272వ ర్యాంకు వచ్చింది. నారాయణపేట జిల్లా నుంచి సివిల్ సర్వీసెస్‌కు ఎంపికైన తొలి వ్యక్తి బి. రాహుల్ కావడం గమనార్హం. భద్రాచలం ఐటీడీఏ పీవోగా రాహుల్ బుధవారం బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలిపారు.



నగరంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల చిత్రపటాలకు పాలతో అభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

'రుణమాఫీ'... చరిత్రలో నిలిచిపోతుంది

- శ్లాఘించిన కాంగ్రెస్ నేతలు
- సీఎం రేవంత్, మంత్రి తుమ్మల చిత్రపటాలకు క్షీరాభిషేకం

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 24: కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు అధికారంలో ఉన్నా రైతులు, వ్యవసాయ కూలీలకు అండగా ఉంటుందని, త్వరలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అందించబోయే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ పథకం దేశంలోనే చరిత్రగా నిలిచిపోతుందని ఖమ్మం నగర మేయర్ పూనకొల్లు నీరజ, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం ఖమ్మంలోని మంత్రి తుమ్మల క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చిత్ర పటాలకు కాంగ్రెస్ నాయకులు పాలతో అభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సొంతంగా వ్యవసాయం చేస్తున్న మంత్రి తుమ్మలకు అతివృష్టి, అనావృష్టి, ఇబ్బందులు తెలుసునని అన్నారు. రైతులకు వ్యవసాయ ప్రయోజనాలను కల్పించేందుకు మంత్రి అనేక కార్యచరణలు చేస్తున్నారని, గత ప్రభుత్వంలో రైతులకు అందని వ్యవసాయ ప్రోత్సహకాలను భవిష్యత్‌లో అందించేందుకు కార్యచరణ జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాధు రమేశ్‌రెడ్డి, కార్పొరేటర్లు దుద్దుకూరి వెంకటేశ్వర్లు, మలీదు వెంకటేశ్వర్లు, లకావత్ సైదులునాయక్, కమర్తపు మురళీ, మలీదు జగన్, నాయకులు పంతంగి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మళ్లీ 'నామినేటెడ్' సందడి

పదవుల కోసం కాంగ్రెస్‌లో నేతల పోటాపోటీ

ఖమ్మం, జూన్ 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లోక్‌సభ ఎన్నికల కోడ్ ముగియడం, పరిపాలనలో ప్రభుత్వంనిమగ్నం కావడంతో ఉమ్మడి జిల్లాలోని కాంగ్రెస్ నేతల్లో మళ్లీ నియామక పదవులపై ఆశలు పెరుగుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ వెళ్లి వచ్చిన తర్వాత ప్రభుత్వ నియామక పదవులు ఖరారవుతాయని కాంగ్రెస్ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. ఖాళీగా ఉన్న మంత్రివర్గ విస్తరణతో పాటు కార్పొరేషన్ చైర్మన్ పదవులు దేవాదాయ, మార్కెటింగ్‌తో పాటు పలురకాల కార్పొరేన్ పాలక కమిటీల పదవులకు ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉందని భావిస్తున్నారు. దీంతో ఎవరికి వారు హైదరాబాదులో పావులు కదుపుతున్నారు.

లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ ముందు నియమించిన కార్పొరేషన్ పదవులలో పాలేరు నియోజకవర్గం నుంచి గత అసెంబ్లీ ఎన్నికల నుంచి టికెట్ ఆశించిన రాయల నాగేశ్వరావు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా, భద్రాచలంలో కాంగ్రెస్ నుంచి గత ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయిన మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరుడు మువ్వా విజయ్‌బాబు విద్యామౌలిక సదుపాయాల కల్పన సంస్థ చైర్మన్‌గా, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అనుచరుడుగా ఉన్న నాయుడు సత్యనారాయణ హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియమితులయ్యారు. అయితే అధికారికంగా ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడలేదు. ఎన్నికల కోడ్‌తో అవి పెండింగ్‌లో పడ్డాయి. సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ వెళ్లి వచ్చిన తర్వాత అధికారిక ఉత్తర్వులు వెలువడతాయని ప్రచారం జరుగుతోంది. అలాగే కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచదరి వర్గీయులకు ప్రాధాన్యత రాలేదు. దీంతో తుమ్మల, రేణుక వర్గాలకు చెరో కార్పొరేషన్ చైర్మన్ పదవులు లభించే అవకాశం ఉంది. కొత్తగా మరికొన్ని పేర్లు ప్రతిపాదించిన తర్వాత మొత్తం జాబితా వెలువడనుంది. వీటితో పాటు రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పలు కార్పొరేషన్లు ఆర్టీసీతో పాటు పలు ప్రభుత్వ శాఖలకు సంబంధించిన జోన్ కమిటీలు, భద్రాచలంతో పాటు ఇతర పుణ్యక్షేత్రాలకు సంబంధించి ఆలయ పాలకవర్గం కమిటీలు కూడా ఖాళీగా ఉన్నాయి. రవాణశాఖతో పాటు పలు కార్పొరేషన్ల డైరెక్టర్లపదవులు నియామకం జరగాల్సి ఉంది. దీంతో అధికార పార్టీలోని మంత్రులు ఎమ్మెల్యేల అనుచరులు గత అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్లు దక్కని ఆశావరులు మళ్లీ పదవులపై కొండంత ఆశతో ఎదురుచూస్తున్నారు. పాలేరు, ఖమ్మం, సత్తుపల్లి, మధిర, కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం, పినపాక, వైరా, అశ్వారావుపేట నియోజక వర్గాల్లో మంత్రులు భట్టి, తుమ్మల, పొంగులేటి అనుచరులతో పాటు రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి వర్గీయులతో పాటు ఎవరికివారు నియామక పదవులు దక్కుతాయని సిఫారసులు చేయిస్తున్నారు. మరోవైపు ఖమ్మంతో పాటు ఉమ్మడి జిల్లాలోని వ్యవసాయ మార్కెట్, ఖమ్మం, కొత్తగూడెం గ్రంథాలయ కమిటీలు, ఖమ్మం 'సుడా' కమిటీ చైర్మన్ డైరెక్టర్ల పదవులకు కూడా నియామకాలు జరగబోతున్నాయి. వీటికి కూడా ఎవరికి వారు పోటాపోటీగా పైరవీలు సాగిస్తున్నారు. ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల సిఫారసులతో పదవులు రానున్నాయి. ఆశాపరుల పోటీతో అటు మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా ఎవరికి సిఫారసు చేస్తే ఎవరికి కోపం వస్తుందోనని వేచి చూసే ధోరణిలో ఉన్నారు. ఉమ్మడిజిల్లా కాంగ్రెస్‌లో నాలుగు వర్గాలు కొనసాగుతుండగా సీనియర్లు, జూనియర్లు, ప్రెషర్స్ అనే వ్యత్యాసం నెలకొంది. వీరందరినీ సమన్వయం చేసుకుని పదవులకు ఎంపిక చేయడం కూడా మంత్రులకు కత్తిమీద సాములాంటిదే. ఆయా నియోజకవర్గాల్లో ముగ్గురి నుంచి ఐదుగురు వరకు ముఖ్య నేతలు నియామక పదవులపై ఆశలు పెట్టుకుని పావులు కదుపుతున్నారు.



'సకిని'కి కన్నీటి వీడ్కోలు

- అధికార లాంఛనాలతో నిర్వహించాలని కుటుంబ సభ్యుల డిమాండ్
- వీలుకాదని సర్దిచెప్పిన భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు
- నివాళులర్పించిన పలువురు నాయకులు, అధికారులు

వివరాలు : 7లో

ముందే ముగిసిన 'పని'

- ఇరు జిల్లాల్లో రికార్డుస్థాయిలో 'ఉపాధి' పని దినాలు
- గడువుకు ముందే పూర్తవ్వడంపై కేంద్రం ఆరా
- నివేదికలు పంపిన జిల్లా అధికారులు
- అవినీతి ఆరోపణపై సోషల్ ఆడిట్ చేయిస్తాం: డీఆర్డీవో సన్యాసయ్య వెల్లడి

6



'సీతారామ' భూ నిర్వాసితులకు పరిహారం

- 100 మందికి రూ.10కోట్లు మంజూరు

సత్తుపల్లి, జూన్ 24: సీతారామ ప్రాజెక్టు భూ నిర్వాసితులకు రూ.10కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరుచేసిందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి సోమవారం తెలిపారు. సీతారామ ప్రాజెక్టు పరిధిలోని సత్తుపల్లి మండలం యాతాలకుంట గ్రామ భూనిర్వాసితులు 100మందికి ఈ పరిహారం అందనుంది. నిధుల మంజూరుకు కృషిచేసిన రాష్ట్రమంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలకు ఎమ్మెల్యే ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

డీసీసీబీ పరిధిలో రూ.908.28 కోట్ల రుణమాఫీ

- ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం
- డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు



ఖమ్మం, జూన్ 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం డీసీసీబీ పరిధిలోని వంద ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, కోపరేటివ్ బ్రాంచీల పరిధిలో 1,69,868 రైతులకుగాను రూ.908.28కోట్ల రుణమాఫీకి ప్రతిపాదనలు పంపామని, ఖమ్మం డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు వెల్లడించారు. సోమవారం ఖమ్మం డీసీసీబీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రుణమాఫీ అర్హత నిబంధనలు అనుసరించి ఎంతమందికి రుణమాఫీ అవుతుందన్నది తర్వాత నిర్ణయిస్తామని తెలిపారు. ఇందులో సహకారసంఘాల ద్వారా రూ.844.84కోట్లు ఉండగా మిగిలినవి డీసీసీబీ బ్రాంచీల పరిధిలో రుణాలు ఇచ్చినవని తెలిపారు. ఖమ్మం డీసీసీబీ గడిచిన సీజన్‌లో రూ.2984కోట్లు రుణాలు ఇచ్చిందని తెలిపారు. డీసీసీబీలో దీర్ఘకాలికంగా ఉన్న మొండి బకాయిలను కూడా వసూలు చేసి రూ.3.88కోట్ల వరకు లాభాలల్లో ఉందని, రాష్ట్రంలో కరీంనగర్ తర్వాత ఖమ్మం డీసీసీబీ రెండోస్థానంలో నిలిచిందన్నారు. రూ.3వేల కోట్లపైగా ఖమ్మం డీసీసీబీ టర్నోవర్ నడుస్తుందని తెలిపారు. గత కొన్నేళ్లుగా ఖమ్మం డీసీసీబీలో గడువులోగా రుణాలు చెల్లించిన రైతులకు వడ్డీరాయితీ కింద రూ.40కోట్లు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయడం వల్ల ఆర్థికంగా నష్టాల్లో ఉన్న రైతులకు కొంత అప్పుల భారం తగ్గనుందని, తద్వారా రైతులు వ్యవసాయపరంగా అప్పులభారం నుంచి బయటపడి కోలుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. గడువులోగా చెల్లించిన రైతులకు సంబంధించిన వారికి కూడా రుణమాఫీ నిబంధనలు వర్తించే అవకాశం ఉంటుందని వివరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు రాష్ట్రంలోని ఇతర మంత్రులు రాష్ట్రంలో రూ.2లక్షల రుణమాఫీకి నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ఈప్రక్రియలో భాగంగా 2018 డిసెంబరు 12నుంచి 2023 డిసెంబరు 9 వరకు రుణాలు తీసుకున్న రైతులకు రుణమాఫీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. ఈ విలేకరుల సమావేశంలో డీసీసీబీ జీఎంలు ఎ.పద్మావతి, కె.నర్మద తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం రామాలయం ఇన్‌చార్జ్ ఈవోగా శ్రీకాంతారావు

- బాధ్యతలు స్వీకరించిన అధికారి

భద్రాచలం, జూన్ 24: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఇన్‌చార్జి ఈవోగా దేవాదాయశాఖ వరంగల్ డిప్యూటీ కమీషనర్ శ్రీకాంతారావు బాధ్యతలు సోమవారం స్వీకరించారు. ముందుగా భద్రాద్రి రామయ్యను దర్శించేందుకు ఆలయానికి వచ్చిన ఆయనకు దేవస్థానం అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలికారు. ఈ క్రమంలో దేవస్థానం తరఫున శాలువ, జ్ఞాపిక, ప్రసాదంను ఏఈవో భవానీరామకృష్ణారావు, ఈఈ వి.రవీంద్రనాథ్, ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, అమరవాది విజయరాఘవన్ అందజేశారు. కాగా ఈ సమయంలో ఆలయ ప్రాశస్త్యంను ఆయనకు వైదిక సిబ్బంది వివరించారు. అనంతరం ఈవో క్యాంపు కార్యాలయంలో దేవస్థానం ఇన్‌చార్జ్ ఈవోగా శ్రీకాంతారావు బాధ్యతలు స్వీకరించారు. భద్రాద్రి దేవస్థానం ఈవోగా ఉన్న ఎల్.రమాదేవి పది రోజుల పాటు వ్యక్తిగత సెలవుపై వెళ్లడంతో దేవాదాయ శాఖ వరంగల్ డిప్యూటీ కమీషనర్‌గా ఉన్న శ్రీకాంతారావును దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు నియమించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఏసీ, మేడారం ఈవో రాజేందర్, పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, నిరంజన్‌కుమార్, కత్తి శ్రీనివాస్, ఈవో సీసీ శ్రీనివాసరెడ్డి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రామారావు పాల్గొన్నారు.



ఈవోకు వేద ఆశీర్వచన దృశ్యం

మాటకు కట్టుబడి ఏకకాలంలో రుణమాఫీ

» ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల


సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

వైరా, జూన్ 24: ఇచ్చిన మాటకు కట్టుబడి ఏకకాలంలో రూ.రెండులక్షల రైతుల రుణమాఫీ చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. రైతులకు రూ.రెండులక్షల రుణమాఫీ ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం మండల కాంగ్రెస్ కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఫ్లెక్సీకి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు, పలువురు కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని వారు పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే పేదల కోసం ఐదు గ్యారెంటీ పథకాలను అమలుచేసిందని గుర్తుచేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హ యాంలో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని విమ ర్శించారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, మాజీ వైస్‌ఎంపీపీ కట్ల రంగారావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, నాయకులు దాసరి దానియేలు, దొడ్డా పుల్లయ్య, రాంపూడి రోశయ్య, పాలేటి నర్సింహారావు, మచ్చా బుజ్జీ, పొదిల హరినాథ్, పొట్టపల్లి శ్రీనివాసరావు, మట్టూరి కృష్ణారావు, పమ్మి అశోక్, పణితి శ్రీను, బొళ్ల గంగారావు, గుగులోతు రాము, దేనువకొండ పుల్లంరాజు, గుత్తా రామారా వు, మంచల జయరావు, దార్న రాజశేఖర్, బీడీకే.రత్నం, పఠాన్ జాన్, మల్లు రామకృష్ణ, దర్జీ చెన్నారావు పాల్గొన్నారు.

‘వీరులపోరు గద్దె మేడారం’తో వెలుగులోకి రామచంద్రయ్య

» ఆదివాసీ కథకుడు రామచంద్రయ్య ప్రస్థానం



పాల్వంచలో డాక్యుమెంటరీలో కథలు చెప్పిన రామచంద్రయ్య (ఫైల్)

పాల్వంచ రూరల్, జూన్ 24: ఆదివాసీ వేల్పుల కథకుడు డోలి రామచంద్రయ్య మరణం తర్వాత ఇక ఆదివాసీల చరిత్ర మూలాలను మౌఖికంగా చెప్పేవారు లేనట్లే.. పద్మశ్రీ అవార్డు గ్రహీత సకిన రామచంద్రయ్య ఆదివాసీ వేల్పుల కథకుడు, వాగ్గేయకారుడు. రామచంద్రయ్యను గుర్తించి పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలోని ప్రొఫెసర్ జయధీర్ తిరుమల రావు, మనోజలు వెలుగులోకి తీసుకొచ్చారు. తొలుత పాల్వంచలోని కొమరంభీం ప్రాంగణంలో ఆదివాసీ వేల్పుల పురాణాలను కథల రూపంలో రామచంద్రయ్యతో చెప్పించారు. నాలుగు రోజులపాటు కోయబాషలో రామచంద్రయ్య చెప్తుండగా ఆదివాసీ ఉపాధ్యాయురాలు అనసూర్య తెలుగులో చెప్త ఒక డాక్యుమెంటరీని తీయడం జరిగింది. అప్పటి నుంచి ఆయన ప్రస్థానం ఇలా సాగింది...

2014 నవంబరులో తొగ్గూడెంలో అప్పటి ఐటీడీఏ పీవో దివ్య సహకారంతో ఆదివాసీ వీరులైన పడిగరాజు, గడికామ రాజు, బోయరాజు, బసవమ్మ, గుంజేడు ముసలమ్మ కథలను రామచంద్రయ్య ద్వార చెప్పించి పుస్తకాల రూపంలో ముద్రించారు. 2018 నవంబరులో ‘వీరులపోరుగద్దె’ మేడారం సమ్మక్క- సారలమ్మపై కోయడోలీల కథ డాక్యుమెంటరీ రూపంలో బయటకు తీశారు. సమ్మక్క - సారలమ్మ పై రామచంద్రయ్య డోలికథ పై భద్రాచలం ఐటీడీఏలో ఆదివాసీలతో సమీక్షించారు. తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే సమ్మక్క - సారలమ్మల కథను విశదీకరించే వ్యక్తిగా రామచంద్రయ్యను గుర్తించారు. రామచంద్రయ్య పక్కనే ఉన్న చత్తీస్‌గఢ్, ఒరిస్సా రాష్ట్రాల్లో కూడ ఆదివాసీ కథలను చెప్పేవ్యక్తిగా గుర్తింపులోకి వచ్చారు. రామచంద్రయ్య ఆదివాసీ పురాణాల కథలు చెప్పడంలో ఏకైక వ్యక్తిగా మిగిలారు. 2019 నుంచి 2021 వరకు రామచంద్రయ్య డాక్యుమెంటరీలపై అనేక విశ్వవిద్యాలయాల్లో చర్చసాగింది. వీరుల పోరుగద్దె మేడారం డాక్యుమెంటరీపై సమీక్షలు జరిగాయి. వీరులపోరు గద్దె పుస్తకావిష్కరణ, 2018 జనవరిలో పూర్తిస్థాయిలో డాక్యుమెంటరీ విడుదల చేశారు. అనంతరం అప్పటి గవర్నర్ తమిళిసైకు రామచంద్రయ్య డాక్యుమెంటరీని అందజేశారు. ప్రభుత్వం సమ్మక్క - సారలమ్మ జీవిత చరిత్రను రామచంద్రయ్య చెప్పిన కథలను, పుస్తకాల రూపంలో విడుదల చేశారు. ఆయన కథల ప్రస్థాన నేపథ్యాన్ని పరిశీలించిన అనంతరం మన రాష్ట్రం తరఫున రామచంద్రయ్యకు పద్మశ్రీ అవార్డు దక్కింది. పద్మ శ్రీ అవార్డు పొందిన నాటి నుంచి ఆయనకు ఒక ప్రత్యేక గౌరవం మాత్రం దక్కింది. ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడు ఆదివాసీ సమూహంలో కథలు చెప్పే వారు లేనట్లే అయింది. అనారోగ్యంతో బాధపడుతూ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందడంతో ఆదివాసీ సమాజానికి తీరని లోటుగానే మిగిలింది.

డిపోల అభివృద్ధికి సహకారం

» రిజియన్ మేనేజర్ సరిరాం » సత్తుపల్లి ఆర్టీసీ డిపో ఆకస్మిక సందర్శన


సత్తుపల్లి ఆర్టీసీ బస్టాండ్‌లో అధికారులతో మాట్లాడుతున్న ఆర్టీసీ ఆర్ఎం సరిరాం

సత్తుపల్లిరూరల్, జూన్24: రీజియన్‌లోని అన్ని డిపోల అభివృద్ధికి ప్రయాణీకులతో ఉద్యోగులు పూర్తి సహకారం అవసరమని ఖమ్మం రిజియన్ మేనేజర్ డీ.సరిరాం అన్నారు. సోమవారం సాయంత్రం ఆయన సత్తుపల్లి ఆర్టీసీ డిపో, బస్‌స్టేషన్‌ను సందర్శించారు. డిపోలో పురోగతి, బస్సుల పరిస్థితి, ఉద్యోగుల సమస్యలు తదితర అంశాలపై డిపో మేనేజర్ యూ.రాజ్యలక్ష్మీని అడిగి తెలుసుకున్నారు. డిపోకు కావాల్సిన సౌకర్యాలు, ప్రయాణికులకు అందుతున్న సౌకర్యాలపై నేరుగా వారితో కలిసి మాట్లాడారు. అదేవిధంగా ఏళ్లుగా ఖాళీగా ఉంటున్న షాపులను మళ్లీ ఆక్షన్ ద్వారా వచ్చిన వారికి ఇవ్వాలని డీఎంకు సూచించారు. దొంగతనాలను అరికట్టేందుకు బస్టాండ్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు స్థానిక దాతలతో పాటు సింగరేణి సంస్థ సహకారం తీసుకోవాలని, ప్రయివేట్ వాహనాలను లోనికి అనుమతించవద్దని, అసాంఘీక కార్యకలాపాలు, గొడవలు జరుగకుండా స్థానిక పోలీసుల సహకారం తీసుకో వాలని డీఎంకు సూచించారు. అదేవిధంగా ఇప్పటికే ప్రారం భించిన హైదరాబాద్, విజయవాడ, శ్రీకాకుళం రూట్లలో బస్ సర్వీసుల పురోగతిపై చర్చించగా బెంగుళూరు ఇతర ప్రాంతాలకు బస్సుల ఏర్పాటు చేయాలని పలువురు ప్రయాణీకులు ఆర్ఎంను కోరగా పరిశీలిస్తానన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం పవిత్ర, డీఎం రాజ్యలక్ష్మీ, అసిస్టెంట్ మేనేజర్ పీ.విజయశ్రీ, ఏడీసీలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఇంటర్ బెటర్‌మెంట్ ఫలితాల్లో న్యూవిజన్ విజయకేతనం


విద్యార్థులతో న్యూవిజన్ కళాశాల చైర్మన్ సీహెచ్‌జీకే ప్రసాద్

సోమవారం విడుదలైన ఇంటర్ బెటర్మెంట్ ఫలితాల్లో ఖమ్మం నగరంలోని న్యూవిజన్ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయ దుందుభీ మోగించారని విద్యా సంస్థల చైర్మన్ సీహెచ్‌జీకే ప్రసాద్ తెలిపారు. జూనియర్ ఇంటర్‌లో లాలానిక చౌదరి, జీహెచ్ ప్రణయ్‌లు 470 మార్కులకు 468 మార్కులు సాధించి రాష్ట్ర ప్రథమ స్థానంలో నిలిచారని తె లిపారు. 467 మార్కులతో పి. రుత్విక, పి. శంశాంక్, పి అశ్రిత, పి. యోగిత, సీ హెచ్ నిషిత, డి. ప్రణతి, మనస్వీ చౌదరి, ఎస్. స్నేహిత, జి. రిషితతో పాటు మరి కొందరు ఉత్తమ మార్కులు సాధించారు. బైపీసీలో వై. సూర్యతేజ 440 మార్కులకు 437 సాధించారు. ఎస్. గ్రీ ష్మా, రూపశ్రీ, యశ్వంత్, బింధుప్రియ, సీతల్, ఆకాం క్ష, టి. నవీన 436, మార్కులు సాధించారు. ఎంపీసీలో 227 మంది, బైపీసీలో 32 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ గోపీచంద్, అకాడమిక్ డైరెక్టర్ సిహెచ్ కార్తీక్, ప్రిన్సిపాల్ బ్రహ్మచారి శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య విద్యార్థుల హవా


విద్యార్థులతో శ్రీచైతన్య యాజమాన్యం

ఖమ్మం ఖానాపురంహవేలి జూన్ 24: ఇంటర్మీడియట్ బెటర్మెంట్ ఫలితాల్లో ఖమ్మం నగరంలోని శ్రీచైతన్య కళాశాల విద్యార్థులు విజయకేతం ఎగురవేశారని విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య తెలిపారు. కళాశాలకు చెందిన మొదటి సంవత్సరం ఎంపీసీ విద్యార్థులు 470 మార్కులకు 468 మార్కులు సాధించిన విద్యార్థులు ఏ సాయితేజ, ఎస్ సాకేత్, జి రిషిక, కె మణికీర్తి, పి ప్రణతి, ఎస్ వినీల, టి ఉత్తేజిత, బి గణేష్, బైపీసీ విభాగంలో 440 మార్కులకు గాను 438 మార్కులు సాధించిన విద్యార్థులు బి రిషిత, జి గీతిక, 437 మార్కులు సాధించిన విద్యార్థులు ఏ జోస్న, ఎం మనీషా, వి ప్రియాంకలు అత్యుత్తమ మార్కులు సాధించారని తెలిపారు. అనంతరం విద్యార్థులను అభినందించారు.

సింగరేణి భవిష్యత్‌పై నీలి నీడలు

- » లీజు ప్రాంతంపై మాత్రమే సింగరేణికి హక్కులు
- » లీజు లేని ప్రాంతాల్లో గనులకు ఇక ముందు టెండర్లు
- » టెండర్లు దక్కినా ప్రైవేటు కంపెనీల పోటీ సాధ్యమేనా?
- » కేంద్ర ప్రభుత్వంపైనే పూర్తి ఆశలు
- » సత్తుపల్లిలో ప్రారంభం కాని 3వ బ్లాకు



సత్తుపల్లి, జూన్ 24: కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో సింగరే ణి సంస్థపై నీలి నీడలు కమ్ముకుంటున్నాయి. దశాబ్దాల కాలం నుంచి ఒక వెలుగు వెలిగిన సింగరేణి సంస్థ ఇక ముందు బొగ్గు గనులు దక్కించుకోవటం కోసం ప్రైవేటు రంగంతో పోటీ పడాల్సి వస్తోంది. కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనులను బహిరంగ వేలం ద్వారా కేటాయించాలని నిర్ణయిం చి ఆ మేరకు ప్రక్రియ వేగవంతం చేయటంతో ఇక ముందు బొగ్గు గనులు సింగరేణి సొంతంగా ప్రారంభించే పరిస్థితి కనిపించటం లేదు. కేంద్ర ప్రభుత్వం మైన్స్, మినరల్స్ డెవలప్‌మెంట్ రెగ్యులేటరీ యాక్టు చట్టం రూపొందించింది. దీని ప్రకారం బహిరంగ వేలంలో బొగ్గు గనులను ప్రైవేటు సంస్థలకు కేటాయించనుంది.

లీజు ప్రాంతాల్లో మాత్రమే హక్కులు

సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రంలో మొత్తం 10 ఏరియాలు ఉన్నాయి. వీటి పరిధిలో ఓపెన్ కాస్టు, భూగర్భ బొగ్గుగనులు మొత్తం 42 ఉన్నాయి. మొత్తం 42వేల మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. ఈ చట్టం ప్రకారం 2013కు ముందు సింగరేణి సంస్థ లీజు భూములలో చేపట్టిన, లేక చేపట్టాల్సిన గనుల్లో మాత్రమే సింగరేణికి హక్కులు ఉన్నా యి. చట్టం వచ్చిన తరువాత లీజు ప్రాంతంలో సింగరేణికి సంస్థకు లేని ప్రాంతంలో బొగ్గు తవ్వకాలు జరిపే అవకాశం లేదు. చట్ట ప్రకారం కేంద్ర ప్రభుత్వం గనులు బహిరంగ వేలం ద్వారా కేటాయిస్తుండటంతో వేలంలో పాల్గొని దక్కిం చుకోవాలి. లేదా కేంద్ర ప్రభుత్వం నేరుగా సింగరేణి సంస్థకు గనులు కేటాయించాలి. చట్టం ప్రకారం ప్రస్తుతం సింగరేణి సంస్థ పది ఏరియాల్లో ఉన్న 42 గనులు మాత్రమే లీజు ఏరియాలో ఉన్నాయి.

ప్రైవేటు పోటీ

బొగ్గు గనుల వేలం సమయంలో ప్రైవేటు సంస్థలు బొగ్గు గనులు దక్కించుకునేందు ఆయా సంస్థల నుంచి పోటీని సింగరేణి సంస్థ తట్టుకునే అవకాశం ఉందా అనే అనుమానా లు కూడా వ్యక్తం అవుతున్నాయి. ప్రైవేటు సంస్థలతో పోలిస్తే సింగరేణిలో ఉద్యోగులకు వేతనాల్లో అధికంగా ఉంటాయి. ప్రైవేటు సంస్థల ఖర్చులు కూడా తక్కువగా ఉంటాయి. వెరసి బొగ్గు ఉత్పత్తి ఖర్చు తక్కువగా ఉంటే ప్రైవేటు సంస్థలు కూడా బొగ్గు తక్కువ ధరకు తగ్గించి విక్రయించే అవకాశం ఉందని సింగరేణి బొగ్గుఉత్పత్తి వ్యయం ఎక్కువ అవటం వల్ల ధర కూడా ఎక్కువగా ఉంటుందని దీని వల్ల సింగరేణికి ఇబ్బందులు తప్పవని సింగరేణి సంస్థలో పని చేసే మాజీ ఉద్యోగులు అంటున్నారు.

కొత్త గనులు లేకుంటే ప్రశ్నార్థకం..

సింగరేణి సంస్థకు కొత్తగా బొగ్గు గనులు దక్కకపోతే ఇ బ్బందులు తలెత్తే పరిస్థితి ఉంది. రానున్న కొద్ది సంవత్సరాల్లో కొన్ని గనుల్లో బొగ్గు నిల్వలు అయిపోతే వాటిని మూసి వేయాల్సిన పరిస్థితి. దీంతో కొన్ని ఏళ్లలో బొగ్గు ఉత్పత్తి కూడా తగ్గిపోయే అవకాశం ఉందని అంటున్నారు. ఉదాహరణకు సత్తుపల్లి మండలం కిష్టారం ఓపెన్ కాస్టు బొగ్గుగని జీవిత కాలం మరో ఆరేళ్లు మాత్రమే ఉంటుంది. తరువాత ఈ గని మూసేయాల్సిన పరిస్థితి. ఇక్కడి ఉద్యోగులు వేరే చోటికి బది లీ కావాల్సి ఉంటుంది. కాని కొత్త గనులు దక్కించుకుంటేనే ఉద్యోగులను కూడా సర్దుబాటు చేసే అవకాశం ఉంది. లేకుంటే పరిస్థితి ఆందోళనకరంగా మారనుంది.

ప్రారంభం కాని సత్తుపల్లి బ్లాక్-3

కేంద్ర ప్రభుత్వం బొగ్గుగనులు వేలం వేసే ప్రక్రియలో గతంలో సత్తుపల్లి బ్లాక్-3, కోయగూడెం గనులను వేలంలో ప్రైవేటు సంస్థలకు కేటాయించారు. గతంలో సింగరేణి సంస్థ సర్వే చేసి, భూసేకరణ కూడా జరిగిన తరువాత సత్తుపల్లి బ్లాకు-3 వేలంలో ప్రైవేటు సంస్థ దక్కించుకుంది. కాని ఇప్పటి వరకూ ఇక్కడ పనులు ప్రారంభం కాలేదు. బ్లాకు-3 కోసం కేటాయించిన భూమి మొత్తం గని ప్రాంతం కావటంతో ఇక్కడ వచ్చే ఓవర్‌బర్డెన్ (మట్టి) ఏ ప్రాంతంలో పోయా లనేది స్పష్టత లేదు. దీని కోసం మళ్లీ భూ సేకరణ జరగాల్సి ఉంది.

సత్తుపల్లి బ్లాకు-3 గని కోసం 253 ఎకరాల భూసేకరణ చేసి ఉంచారు. బ్లాకు-3 గని నుంచి కనీసం 260లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి అవుతుందని అంచనా. కాని మూడున్నర లక్షల టన్నుల వరకూ బొగ్గు వెలికి తీయవచ్చని చెపుతున్నారు. సింగరేణి సంస్థ ఇక్కడ బొగ్గు వెలికి తీస్తే 7లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసే అవకాశం ఉందని సింగరేణి అధికారులు చెపుతున్నారు. సాధారణంగా బొగ్గుగని పక్కనే మరో గని వేర్వేరు కంపెనీలు తవ్వాల్సి వస్తే నిబంధనల ప్రకారం సరిహద్దులు నిర్ణయించి గని లోతును బట్టి నిర్ణీత దూరం వదిలి గని తవ్వాల్సి ఉంటుందని చెపుతున్నారు. అదే ఒకే సంస్థ బొగ్గు తవ్వితే మొత్తంగా గని కలిపి తవ్వటం ద్వారా బొగ్గు ఉత్పత్తి అధికంగా ఉంటుందని సింగరేణి సంస్థ వాదన.

ఇక జీఎస్‌ఐ ఆధ్వర్యంలో సర్వే..

ఇప్పటి వరకూ సింగరేణి సంస్థ బొగ్గు నిక్షేపాల కోసం భారీ స్థాయిలో ఖర్చు చేసి సర్వే చేసేది. నాణ్యమైన బొగ్గు లభించే అవకాశం ఉన్న ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో అధ్యయ నం చేసి లాభ, నష్టాలు అంచనాలు వేసుకొని ప్రభుత్వ అనుమతిలో కొత్త గనులు ప్రారంభించేది. కాని కేంద్ర ప్రభు త్వం నిర్ణయంతో ఇక ముందు సింగరేణి స్వంతంగా బొగ్గు నిక్షేపాలకోసం సర్వే చేసినా ఉపయోగం లేదు. దీంతో ఇక ముందు జియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బొగ్గునిక్షేపాల కోసం సర్వే జరిగే అవకాశం ఉందని చెబుతున్నారు.

బెటర్మెంట్‌లో ఆర్జేసీ కళాశాల విద్యార్థి సత్తా

ఖమ్మం ఖానాపురంహవేలి జూన్ 24: ఇంటర్మీడియట్ బెటర్మెంట్ ఫలితాల్లో ఖమ్మం నగరంలోని ఆర్జేసి కళాశాల విద్యార్థి పి. కార్తీక్ సీఈసీలో 500 మార్కులకుగాను 472 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచాడని కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. అనంతరం విద్యార్థి కార్తీక్‌ను అభినందించారు.

నేడు ఖమ్మం ఎంపీగా రఘురాంరెడ్డి ప్రమాణ స్వీకారం

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 24: ఖమ్మం పార్లమెంట్ సభ్యులుగా మంగళవారం రామసహాయం రఘురాం రెడ్డి ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇటీవల జరిగిన లోకసభ ఎన్నికల్లో ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన ఆ యన భారీ మేజార్టీతో గెలుపొందిన విషయం విధితమే. మేజార్టీలో రాష్ట్రంలోనే ద్వితీయ స్థానంలో రఘురాంరెడ్డి నిలిచారు. కాగా రఘురాంరెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా నుంచి ముఖ్యమైన నాయకులు ఇప్పటికే ఢిల్లీ చేరుకున్నారు.

రామచంద్రయ్య మృతి జానపద కళకు తీరనిలోటు


నివాళులర్పిస్తున్న డీసీసీబీ డైరెక్టర్ బ్రహ్మయ్య

అశ్వాపురం జూన్ 24: పద్మశ్రీ అవార్డు గ్రహీత మణుగూరు మండలం కూనవరం గ్రామానికి చెందిన సకిని రామచంద్రయ్య మృతి జానపద కళకు తీరనిలోటని డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య పేర్కొన్నారు. సోమవారం ఆయన మణుగూరులో రామచంద్రయ్య మృతదేహానికి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ వారసత్వంగా వచ్చిన గిరిజన సంప్రదాయకళను జీవనాధారంగా చేసుకుని, అంతరించిపోతున్న డోలు వాయిద్యానికి జీవం పోసిన వ్యక్తి రామచంద్రయ్య అని కొనియాడారు. గిరిజన సంస్కృతి,సాంప్రదాయాలను కాపాడి తెలంగాణ రాష్ట్రానికి డోలు వాయిద్యంతో దేశవ్యాప్తంగా కీర్తిని సాధించిపెట్టారన్నారు. ఈసందర్భంగా రామచంద్రయ్య మృతిపట్ల ఆయన కుటుంబ సభ్యులకు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు ముత్తినేని శ్రీనివాసరావు, వేములపల్లి కృష్ణార్జున్ పాల్గొన్నారు.

అడవిపంది మాంసం స్వాధీనం

దమ్మపేట, జూన్, 24: అడవిపంది మాంసం విక్రయిస్తుండగా పారెస్టు అధికారులను చూసి పరారైన ఘటన దమ్మపేట అటవీరేంజ్ పరిధిలోని బీమునిగూడెంలో ఆదివారం రాత్రి జరిగింది. తోటలో అడవిపంది మాంసం విక్రయిస్తున్నారన్న సమాచారం దమ్మపేట పారెస్టు అధికారులు సంఘటనా స్థలానికి వెళ్ళగా అధికారులను చూసి మాంసం విక్రయిస్తున్న వారు పరారయ్యారు. అక్కడవున్న సుమారు కేజిన్నర పైగా మాంసాన్ని ఒక ద్విచక్రవాహనాన్ని స్వాదీనం చేసుకొని దమ్మపేట రేంజ్ కార్యాలయానికి తరిలించారు. రెంజర్ మాట్లాడుతు అడవి మాంసంపై విచారణ జరపుతున్నామని నిందుతులని పట్టుకొని కేసునమోదు చేస్తామని తెలిపారు.

జాతీయస్థాయి అథ్లెటిక్ పోటీలకు నగర క్రీడాకారులు

ఖమ్మంస్పోర్ట్స్, జూన్ 24: హర్యాన రాష్ట్రం పంచెకులలో ఈనెల 27 నుంచి 30 వరకు జరిగే జాతీయస్థాయి సీనియర్ అథ్లెటిక్స్ పోటీలకు ఖమ్మంనగరంలోని అథ్లెటిక్స్ అకాడమీ క్రీడాకారుడు ఎం.గౌతమ్, నగరానికి చెందిన ఏ. మైథిలి ఎంపికయ్యారు. వీరు ఇటీవల హనుమకొండలో జరిగిన తెలంగాణ రాష్ట్రస్థాయి సీనియర్ అథ్లెటిక్స్ పోటీలలో ప్రతిభ చూపి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను వీవైఎస్‌వో సునీల్‌రెడ్డి, కోచ్ గౌష్, జిల్లా అథ్లెటిక్స్ సంఘం బాధ్యులు తదితరులు అభినందించారు. జాతీయ పోటీలలో సైతం రాణించి జిల్లాకు ఖ్యాతిని తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

ఆన్‌లైన్ స్కీమ్.. ఘరానా స్కామ్..

(5వ పేజీ తరువాయి)

గోల్డ్ స్కీంలు పెడుతున్నాం.. చిట్స్ నడుపుతున్నాం.. అంటూ నమ్మబలుకుతూ వచ్చాడు.

అడ్రస్ ఫేక్...

కంపెనీ హెడ్ ఆఫీస్ అడ్రస్ బెంగళూరు పేరుపై ఉంది. బ్రాంచి కార్యాలయం నేలకొండపల్లిలో ఉంది. ఐదు నెలల క్రితం దీన్ని ఖమ్మం నగరంలోని ప్రకాష్‌నగర్ ప్రాంతానికి మార్చాడు. బెంగళూరు చిరునామా పూర్తిగా తప్పుడు సమాచారం అనేది తెలుస్తోంది. అది కూడా తన అక్క పేరుపై ఉన్నట్లుగా సమాచారం. ఆమె ఏమీ చదువుకోలేదని తెలుస్తోంది.

రూ.100 కోట్లకు కుచ్చుటోపీ ?

ఎస్ఎస్‌వీ ఆన్‌లైన్ మనీ సర్క్యులేషన్ కంపెనీ బోర్డు తిప్పేసినట్లు విశ్వసనీయ సమాచారం. గత రెండు నెలలుగా కంపెనీ నుంచి డిపాజిట్‌దారులకు ఎటువంటి డబ్బులు అందటంలేదు. డిపాజిట్‌దారుల ఒత్తిడి ఎక్కువ కావడంతో కంపెనీ సీఈవో వీరన్న ఇటీవల ఆత్మహత్యాయత్నం చేశాడు. వీరన్న ఆత్మహత్యాయత్నం చేశాడన్న సమాచారం బయటకు పొక్కటంతో డిపాజిట్‌దారుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. రెండు రోజుల క్రితం కంపెనీ ఎండీలుగా చలామణీ అయ్యే వారు మరికొంత మందితో కలిసి నేలకొండపల్లిలో సమావేశమయ్యారు.

పోలీసులకు ఫిర్యాదు

వీరన్న బాధితులు ఆదివారం రాత్రి నేలకొండపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. చెన్నారం గ్రామానికి చెందిన మానుకొండ రామారావు తాను సుమారు రూ.4.37లక్షలు డిపాజిట్ చేశానని, రెండు నెలలుగా తనకు ఎటువంటి పేమెంట్ రాలేదని, తాను మోసపోయానని తెలిపాడు. ఇదే విషయాన్ని నేలకొండపల్లి పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు వీరన్నపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తోట నాగరాజు సోమవారం రాత్రి తెలిపారు. ఇదిలా ఉండగా అత్యాశతో ఆన్‌లైన్ స్కీమ్‌లో పెట్టుబడి పెట్టిన వారు తాము మోసపోయామని తెలుసుకొని లబోదిబోమంటున్నారు. అయితే వారు ఈ వ్యవహారంపై ఫిర్యాదు చేయటానికి వెనుకాడుతున్నట్లుగా తెలుస్తోంది.

ఎవరీ వీరన్న...?

ఆన్‌లైన్ మనీ సర్క్యులేషన్ స్కీమ్ పేరుతో జనానికి కుచ్చు టోపీ పెట్టిన భూక్యా వీరన్న ఎవరనేది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. నేలకొండపల్లి పోలీసులు ఇతనిపైన కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్న నేపథ్యంలో వీరన్న బ్యాక్‌గ్రౌండ్ ఏమిటనేది ఆసక్తికరంగా మారింది. అయితే ఇతని పూర్తి వివరాలు ఎవరూ చెప్పలేకపోతున్నారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం మంగాపురంతండాకు చెందిన వీరన్న.. ఇంటర్ వరకు చదివాడని కొందరు, డిగ్రీ వరకు చదివాడని మరికొందరు చెబుతున్నారు. కొంతకాలం ఇతను జగ్గయ్యపేట, మేళ్ళచెర్వులలో ఉన్న సిమెంట్ ఫ్యాక్టరీలలో పని చేసాడని తెలుస్తోంది. ఆ తర్వాత కొంత కాలం హైదరాబాద్‌లోని ప్రైవేటు సంస్థల్లో పని చేసి మూడేళ్ల క్రితం స్వగ్రామం మంగాపురంతండా వచ్చినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. గత ఏడాది జూన్‌లో ఎస్ఎస్‌వి పేరుతో ఆన్‌లైన్ మనీ సర్క్యులేషన్ స్కీమ్ ప్రారంభించి మోసానికి తెరతీశాడు. ఈ ఆన్‌లైన్ మోసం వెనుక వీరన్న ఒక్కడే ఉన్నాడా.. ఏదైనా ముఠా ఉందా.. అనేది తెలియడం లేదు. పోలీసుల విచారణ పూర్తయ్యే వరకు నిజాలు బయటకు వచ్చే అవకాశాలు లేవు.

ముందే ముగిసిన ‘పని’

- » ఇరు జిల్లాల్లో రికార్డుస్థాయిలో ‘ఉపాధి’ పనిదినాలు
- » గడువుకు ముందే పూర్తవ్వడంపై కేంద్రం ఆరా
- » నివేదికలు పంపిన జిల్లా అధికారులు
- » అవినీతి ఆరోపణపై సోషల్ ఆడిట్
- » డీఆర్‌డీవో సన్యాసయ్య



ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 24: నిర్ణీత గడువుకంటే ముందే ‘ఉపాధి’ పనిదినాల లక్ష్యాన్ని పూర్తి చేయడంపై కేంద్ర ప్రభుత్వం దృష్టిసారించింది. గడువుకంటే 9నెలల ముందే లక్షిత పనిదినాలు పూర్తికావడంపై వివరణ కోరింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గతం కంటే రికార్డుస్థాయిలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి కూలీ పనులు నిర్వహించారు. ఉపాధి పనిలో రాష్ట్రంలోనే ఖమ్మం జిల్లా ప్రథమస్థానంలో నిలిచింది. రికార్డు స్థాయిలో పని దినాలు నమోదు కావడంపై కేంద్ర ప్రభుత్వం వివరణ కోరింది. దీంతో రెండు రోజులుగా అధికారులు దీనికి సంబంధించిన నివేదికలను రూపొందించి సోమవారం పంపినట్లు తెలుస్తోంది.

కేంద్ర ప్రభుత్వం ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ద్వారా రాష్ట్రానికి 8కోట్ల పని దినాలను కేటాయించగా జాబ్ కార్డుల మేరకు జిల్లాలకు లక్ష్యాలను నిర్దేశించారు. ఖమ్మం జిల్లాలో మార్చి 2025వరకు 34,92,520 పని దినాలను లక్ష్యంగా ఇచ్చారు. అయితే ఇప్పటికే జిల్లాలో 50,94,942 పని దినాలు పూర్తయ్యాయి. ఇంకా తొమ్మిది నెలలపాటు కూలీలకు పని దినాలు కల్పించాల్సి ఉంది. భద్రాద్రి కొత్తగూడెంలో మార్చి 2025 వరకు మొత్తం కూలీలకు 32,78,530 పని దినాలను కేటాయించగా ఇప్పటికే 40,06,936 పని దినాలను పూర్తి చేశారు.

బడ్జెట్ కోసం అధిక పని దినాల విమర్శలు

ఉపాధి కూలీలు పనిచేసిన లక్ష్యాల మేరకు జిల్లా స్థాయిలో ‘ఉపాధి’ పథకంలో పనిచేసే అధికారుల నిర్వహణ వ్యయం, ఉద్యోగుల వేతనాలు, ఇతర ఖర్చులకు బడ్జెట్ మంజూరవుతుంది. రెండేళ్లుగా ప్రభుత్వం కేటాయించిన లక్ష్యాల మేరకు పని దినాలు పూర్తి చేయటంతో ఉద్యోగుల వేతనాలకు ఇబ్బంది ఏర్పడినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది డ్వామా నిర్వాహణ కోసం బడ్జెట్ నిధులు పెరగటానికి పరోక్షంగా పనులకు రాని వారికి సైతం హాజరు నమోదు చేశారని, పని చేసిన కూలీలకు ఎక్కువ కొలతలు నమోదు చేశారని విమర్శలు వచ్చాయి. ఆక్రమంగా జరిగిన ఉపాధి పనిలో క్షేత్రస్థాయి ఉద్యోగులు డబ్బులు తీసుకున్నారని విమర్శలు వినిపించాయి. ముఖ్యంగా కామేపల్లి, ఏన్కూరు తదితర మండలాల్లో ఇటువంటి సంఘటనలు బహిర్గతమయ్యాయి. ఈ నేపథ్యంలోనే ఉపాధి పని దినాలు పెరిగాయని చర్చ జరుగుతోంది.

వివరణ కోరిన కేంద్ర ప్రభుత్వం

2025 మార్చి నాటికి పూర్తి కావాల్సిన పని దినాలు 9నెలలు ముందుగానే పూర్తి కావడంపై కేంద్ర ప్రభుత్వం విస్మయం చెందింది. 2004 తర్వాత ఈ స్థాయిలో పని దినాలు నమోదు కాలేదని, దీనిపై విచారణ చేసి నిర్దిష్ట కారణాలతో నివేదిక పంపాలని కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ రాష్ట్ర గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శికి లేఖ రాశారు. నివేదికలు పంపిన అనంతర కేంద్ర బృందాలు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేస్తాయని పేర్కొన్నారు. దీంతో రాష్ట్ర అధికారులు ఖమ్మం కలెక్టర్, డీఆర్డీవోలను వివరణ కోరారు.

మూడు రోజులుగా జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు ఉపాధి పని దినాలు పెరగటంపై నివేదికలను రూపొందించారు. ఖమ్మం జిల్లాలో వర్షాలు లేకపోవటంతో వ్యవసాయ పనులు జరగలేదని, నాగార్జునసాగర్ నీరు రాకపోవటంతో చెరువులుకు నీరు చేరలేదని, పూడిక పనులకు కూలీలు వచ్చారని, వ్యవసాయ పనులు లేకపోవటంతో కూలీల సంఖ్య గణనీయంగా పెరిగిందని, నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం.

అవినీతి ఆరోపణలపై సోషల్ ఆడిట్

సన్యాసయ్య, డీఆర్‌డీవో

ఉపాధి కూలీలు కోరిన మేరకు పని కల్పించేందుకు ప్రత్యేక కార్యచరణతో ముందుకు వెళ్లటంతో ముందుగానే లక్ష్యం నెరవేరింది. అయితే టార్గెట్ కోసం ఉపాధి పనికి రానివారికి క్షేత్రస్థాయిలోని ఉద్యోగులు దొంగ మస్టర్‌లు, కూలీలకు ఎక్కువగా కొలతలు నమోదు చేశారనే ఆరోపణలపై ఇప్పటికే సోషల్ ఆడిట్‌కు ఆదేశాలిచ్చాం. పారదర్శకంగా ఉపాధి పనులు నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

'తల్లిదండ్రులు తస్మాత్ జాగ్రత్త' అనే రచనకు

సంస్కృతి సంస్థ కళాపురస్కారం

మధిర, జూన్24: మధిర రంగస్థల కళాకారుడు రామభక్త సీతయ్య కళాపరిషత్ నిర్వాహకులు బాబ్లా రచించిన 'తల్లిదండ్రులు తస్మాత్ జాగ్రత్త' అనే నాటిక రచనకు సంస్కృతి సంస్థ గుంటూరు వారు కళాపురస్కారాన్ని అందజేశారు. రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో గుంటూరులో నిర్వహించిన యువనాటికల రచనల పోటీలలో మధిరకు చెందిన ఈ నాటకం ఉత్తమంగా ఎంపికైంది. ఆదివారం రాత్రి గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగిన సంస్థ నాటికల గ్రంథావిష్కరణ కార్యక్రమంలో నాటిక రచయిత బాబ్లాను పోటీల నిర్వాహకులు సన్మానించి, నగదు పురస్కారం అందజేశారు. ఈసందర్భంగా బాబ్లా రచనకు పురస్కారం రావడంపట్ల మధిర రంగస్థల కళాకారుల సంఘం అధ్యక్షుడు పుతుంబాక శ్రీకృష్ణప్రసాద్, డా. నిభానుపూడి సుబ్బరాజు, రిటైర్డ్ ఎంపీడీవో మాదవరపు నాగేశ్వరరావు, జంగాల గురువులు, అంకురం శాస్త్రి, రాళ్లబండి మురళీకృష్ణ, సంక్రాంతి శ్రీనివాసరావు, పసుపులేటి శ్రీనివాసరావులు అభినందనలు తెలిపారు.


అవార్డు అందుకుంటున్న బాబ్లా

విప్పలమడక ఆలయ భూముల కౌలు వేలం


వేలం నిర్వహిస్తున్న ఆలయ అధికారి శ్రీనివాసరావు

వైరా, జూన్ 24: మండలంలోని విప్పలమడకలో ఉన్న సోమలింగేశ్వరస్వామి ఆలయానికి చెందిన భూముల్లో పంటల సాగు నిమిత్తం కౌలుదారులతో ఆలయ అధికారులు సోమవారం వేలం నిర్వహించారు. ఆలయ ఈవో ఎస్‌వీడీ.ప్రసాద్ పర్యవేక్షణలో ఉద్యోగి ఎస్.శ్రీనివాసరావు ఈ వేలాన్ని నిర్వహించారు. ఈ ఆలయానికి సంబంధించి 12ఎకరాల భూములున్నాయి. ఈ భూముల్లో ఖరీఫ్‌లో సేద్యానికిగానూ కౌలుదారులతో వేలం నిర్వహించారు. గత ఏడాది రూ.71,500 కౌలు ద్వారా ఆదాయం సిద్ధించింది. ఈ ఏడాది రూ.లక్షకుపైగా భూముల్లో పంటల సాగుకు చెల్లించేందుకుగానూ కౌలు రైతులు వేలం పాటలో పాల్గొన్నారు. దాదాపు రూ.30వేలకు పైగా కౌలు ద్వారా ఆదాయం పెరిగింది. ఆలయ కమిటీ నిర్వాహకులు వీరపనేని చెన్నకేశవులు, రుద్రాక్షల వెంకటాచారి, గోసు కృష్ణయ్య, యడ్లపల్లి నాగేశ్వరరావు, నీటిసంఘం మాజీ అధ్యక్షుడు కొల్లా వెంకటేశ్వరరావు, గరికపాడు సొసైటీ డైరెక్టర్ దేవభక్తిని అర్జున్‌రావు పాల్గొన్నారు.

రవాణాశాఖలో తెరుచుకున్న కౌంటర్లు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- మూత పడిన 12వ కౌంటర్
- 11కౌంటర్ల ద్వారా సేవలు పొందిన దరఖాస్తుదారులు

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 24: జిల్లా రవాణాశాఖలో సోమవారం దొడ్డి దారికి తలుపులు మూశారు. 12వ కౌంటర్‌ను అధికారులు మూసివేశారు. ఇక మిగిలిన 11 కౌంటర్ల వద్దకు దరఖాస్తుదారులు వెళ్లి వారి వాహనాలకు సంబంధించిన ఆన్‌లైన్ పనులు పూర్తి చేయించుకున్నారు. 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'సింగిల్ కౌంటర్ సిఫార్స్' కథనంపై జిల్లా రవాణాశాఖ అధికారులు దిద్దుబాటు చర్యలను ప్రారంభించారు. జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్లలో నిబంధనల మేరకు దరఖాస్తుదారుల పనులు చేసేందుకు ఉపక్రమించారు.


11కౌంటర్ల వరకు క్యూలో ఉన్న దరఖాస్తుదారులు


మామిడికి అంటు పుల్లలతో అంట్లు కడుతున్న యువకుడు

భళా..అంటు మామిడి మొక్కలు!

- పెంపకానికి కేరాఫ్‌గా నిలుస్తున్న లోక్యాతండ
- విక్రయానికి సిద్ధం చేస్తున్న గిరిజన యువకులు
- ఏటా నర్సరీల్లో సుమారు 40లక్షల మొక్కల పెంపకం
- ప్రభుత్వమే మొక్కలు కొనుగోలు చేయాలని వినతి

కూసుమంచి, జూన్ 24: అంటు మామిడి మొక్కలకు కేరాఫ్‌గా కూసుమంచి మండలం లోక్యాతండ నిలుస్తోంది. మామిడి మొక్కల పెంపకంలో ప్రసిద్ధిగాంచిన ఈ తండాలో నర్సరీల్లో మామిడి మొక్కలు అంట్లు కట్టి పెంచేందుకు సిద్ధం చేస్తున్నారు. తండాలో సుమారు 50 మందికి పైగా యువకులు మామిడి మొక్కలకు అంట్లుకట్టడంలో నైపుణ్యం సాధించి, నర్సరీల్లో మొక్కలు పెంపకం చేపట్టారు.

లోక్యాతండలో సుమారు 50 నర్సరీల ద్వారా కోటి మొక్కలకు పైగా పెంపకం చేపడుతున్నారు. మేలురకాలైన బంగినపల్లి, తోతాపురి, హిమాయత్, మల్లిక, కేసరి, పునాస తదితర రకాలైన మొక్కలు అంట్లుకట్టి పెంచుతారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు తిరిగి మామిడితోటల్లో అంటుపుల్లలను సేకరిస్తారు. జులై, ఆగస్టు నెలల్లో వివిధ రకాల అంటు పుల్లలను సేకరించి, నారు మొక్కలకు అంట్లు కడతారు. అలా అంట్లు కట్టిన అనంతరం సుమారు మూడు నెలల పాటు రెండునుంచి మూడు అడుగులు ఎత్తు వరకు అంట్లు కట్టిన పుల్లలకు కొత్త ఆకులు వేసే వరకు పెంచి విక్రయాన్ని ప్రారంభిస్తుంటారు.

ఉమ్మడి జిల్లాలోని రాజమండ్రి, కడియపులంక, అశ్వరావుపేట, తిరుపతి, చిత్తూరు, బయటి రాష్ట్రాలు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలో విక్రయిస్తుంటారు. పెద్ద నర్సరీ యజమానులతో ఒప్పందం కుదుర్చుకుని వారికి విక్రయిస్తుంటారు. నర్సరీల్లో మొక్కల పెంప కం, రవాణా సందర్భంగా కూలీలకు పనులు దొరుకుతుంది. దీంతో పాకెట్లలో మట్టి నింపడం, టెంకలు పాకెట్లలో కుచ్చడం, మొక్కలు వచ్చిన తర్వాత కలుపు తొలగించడం, గ్రేడింగ్ చేయడం, మందులు పిచుకారీ, కట్టుబడి వచ్చాక నారు మొక్కలకు అంట్లు కట్టడం, చివరకు రవాణా చేయడం వరకు సుమారు మూడు నెలల పాటు కూలీలకు పనులు దొరుకుతుంది. దీంతో కోలాహలంగా మారుతుంది.

మొక్కల పెంపకంలో ఆటుపోట్లు

మొక్కల పెంపకంలో రైతులు ఆటుపోట్లు ఎదుర్కొంటున్నారు. కష్టపడి మొక్కలు అంటు కట్టి పెంచి న తర్వాత.. కొనుగోలు చేసిన వ్యాపారులు నిర్వాహకులకు పైకాన్ని చెల్లించకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. వేలాది రూపాయలు వడ్డీలకు తీసుకవచ్చి పెట్టుబడులు పెట్టి నిర్వహకులు నర్సరీలు నిర్వహిస్తున్నారు. వ్యాపారులు మొక్కలు కొనుగోలు చేసిన వెంటనే పైకాన్ని చెల్లిస్తే ఎలాంటి నష్టం ఉండదు. అదేవిధంగా మధ్య దళారీ వ్యవస్థ వల్లకూడా నర్సరీ నిర్వహకులు తీవ్రంగా నష్టపోతున్నారు.

ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

నర్సరీల్లో పెంచుతున్న మామిడి మొక్కలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని నర్సరీ నిర్వహకులు కోరుతున్నారు. వందలాది మంది యువకులకు ఉపాధి కల్పిస్తూ నర్సరీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మట్టి తరలింపు, పాకెట్లలో మట్టి నింపడం, టెంకలు నాటడం, మొక్కలకు అంటుకట్టడం వంటి పనులతో అనేక మంది యువకులకు, కూలీలకు పనులు కల్పిస్తున్నట్లు తెలిపారు. నాలుగు నెలలపాటు పెట్టుబడులు పెట్టి నర్సరీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పాలకులు తమ శ్రమను గుర్తించి గిరిజనులమైన తమ ఆర్థికాభివృద్ధికి, తమ నర్సరీల్లో పెంచిన మొక్కలను తెలంగాణ ప్రభుత్వం హరితహారం కోసం కొనుగోలు చేయాలని గిరిజన యువకులు విజ్ఞప్తి చేస్తున్నారు.


అంట్లు కట్టిన అనంతరం విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న మొక్కలు

కమ్యూనిస్టులుగా ఉన్నందుకు గర్వపడాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

నేలకొండపల్లి,జూన్24: అవకాశవాద, రాజకీయ పార్లమెంటరీ వ్యవస్థలో కమ్యూనిస్టులుగా ఉన్నందుకు మనమందరం గర్వపడాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. మండల పరిధిలోని బోదుబండ గ్రామంలో సోమవారం నిర్వహించిన రాజకీయ శిక్షణా తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశ వ్యాప్తంగా గత ఎన్నికల్లో వచ్చిన ఫలితాలు మోదీ గ్రాఫ్ పడిపోతున్నదనటానికి సంకేతమన్నారు. బీజేపీ అధికారంలో ఉన్న ఉత్తరాది రాష్ట్రాలలో ఆపార్టీ ఘోర పరాభవాన్ని చూడాల్సి వచ్చిందన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో వచ్చిన ఫలితాలపై ఈనెల 28,29 తేదీల్లో జరిగే కేంద్ర కమిటీ సమావేశాల్లో సమీక్షించనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ హామీల అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రజలను సమీకరించి పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్‌తో కలిసి ఉద్యమించటానికి తమకెలాంటి అభ్యంతరం లేదన్నారు. త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సమరానికి పార్టీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. పార్టీ జిల్లా నాయకుడు బొంతు రాంబాబు రాజకీయ తరగతిని బోధించారు. మండల కార్యదర్శి కేవీ రెడ్డి ప్రిన్సిపాల్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నాయకులు ఏటుకూరి రామారావు, చింతలపాటి భాస్కర్, కట్టికోల వెంకన్న, పగడికత్తుల నాగేశ్వరరావు, భూక్యా కృష్ణ, బెల్లం లక్ష్మి, ఇంటూరి అశోక్, రచ్చా నర్సింహారావు, యడ్ల తిరుపారావు, దుగ్గి వెంకటేశ్వర్లు, మందడపు మురళీకృష్ణ, వల్లంచెట్ల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన ఎంపీ వద్దిరాజు

ఖమ్మం, జూన్24(ఆంధ్రజ్యోతిప్రతినిధి): బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్‌గా నియమితులైన రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర సోమవారం మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తనకు రెండోసారి రాజ్యసభ ఇవ్వడం, పార్లమెంటరీపార్టీ డిప్యూటీ లీడర్‌గా నియమించడంపై కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు.

వద్దిరాజుకు నామా శుభాకాంక్షలు

ఖమ్మంకార్పొరేషన్, జూన్24: రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రను బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ ఉపనేతగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నియమించడం పట్ల బీఆర్ఎస్ లోక్‌సభా పక్ష మాజీనేత, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేస్తూ వద్దిరాజుకు శుభాకాంక్షలు తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో

అన్నిచోట్ల పోటీ చేస్తాం: తాండ్ర

సత్తుపల్లి, జూన్24: భారతీయ జనతా పార్టీకి క్షేత్ర స్థాయిలో ప్రజల్లోకి చొచ్చుకొని పోతుందని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్నిచోట్లా పోటీ చేస్తామని బీజేపీ నాయకుడు తాండ్ర వినోదరావు స్పష్టం చేశారు. సోమవారం సత్తుపల్లిలోని స్వర్ణోత్సవాలు జరుపుకుంటున్న శ్రీ కోదండ రామాలయంలో శ్రీరామ పట్టాభిషేకంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండలంలోని పలు కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో తాము ఓడినప్పటికీ నైతికంగా విజయం సాధించామన్నారు. తనకు ఓట్లు వేసిన 1.20లక్షల మంది ఓటర్లకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. పార్టీని బలోపేతం చేసేదిశగా ప్రతీ కార్యకర్త ప్రజలకు బీజేపీ అందిస్తున్న పథకాలను వివరించాలన్నారు. ఆ పథకాలే రానున్న ఎన్నికలకు శ్రీరామరక్ష అని అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎయిర్‌పోర్ట్ నిర్మాణం విషయంలో రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్ నాయకత్వంతో కలిసి కేంద్రంతో మాట్లాడి ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పామాయిల్ బోర్డు విషయమై పామాయిల్ అసోసియేషన్‌తో చర్చలు జరపగా త్వరలోనే రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి తుమ్మలతో మాట్లాడతానని చెప్పారు. సేంద్రియ వ్యవసాయాన్ని ఎక్కువ ప్రోత్సహించేలా రాష్ట్రప్రభుత్వం తక్షణమే బయో యూనిట్స్‌ను ప్రారంభించాలని, సింగరేణిలో సమస్యల పరిష్కారం దిశగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని సత్తుపల్లికి తీసుకువస్తానన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేయలేదని, నేడు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కేంద్రమంత్రిని కలవడం శుభపరిణామన్నారు. సీతారామ ప్రాజెక్టులో భూ నిర్వాసితులకు స్థానిక ఎమ్మెల్యే ఇచ్చిన హామీ ఏమైందని, రూ.100కోట్ల అభివృద్ధి పనులు చేశామని చెబుతుండగా ఆ నిధులు ఎక్కడి నుంచి వచ్చాయో చెప్పాలని డిమాండ్ చేశారు. గ్రీన్‌ఫీల్డ్ ఎన్‌హెచ్ నిర్మాణంలో ఎంట్రీ, ఎగ్జిట్‌లపై కాంగ్రెస్ నాయకులు గొప్పలు చెప్పుకుంటుంటున్నారని, గతంలో సత్తుపల్లి పర్యటనకు వచ్చిన కేంద్రమంత్రి బీఎల్.వర్మతో ఈ విషయమై అప్పుడే చర్చించామని, ఇతరుల గొప్పలు తమవేనని చెప్పుకోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు గల్లా సత్యనారాయణ, శ్యాంరాథోడ్, పాలకొల్లు శ్రీనివాస్, చావా కిరణ్, విజయ్, నరేష్, మట్టా ప్రసాద్, ప్రభాకర్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, మాదిరాజు శ్రీనివాస్, కార్తీక్, అశోక్, నాగరాజు, నరసింహారావు, నరసింహమూర్తి, సుబానీ, శేషగిరిరావు, శివ, రహ్మతుల్లా, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తాండ్ర వినోదరావు

చికిత్స పొందుతూ మహిళ మృతి

ముదిగొండ, జూన్ 24: పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓమహిళ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన ప్రకారం..రఘునాథపాలెం మండలం చిమ్మపుడి గ్రామానికి చెందిన కణతాల నర్సమ్మ(55), కుటుంబ కలహాలతో ఆమె పెద్ద కుమారుడు శేషగిరితో కలిసి ముదిగొండ మండలం సవర్ణాపురం గ్రామరెవెన్యూలో ఆదివారం గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. స్థానికులు గమనించి వారిని ఖమ్మం ఆసుపత్రికి తరలించగా, నర్సమ్మ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. శేషగిరి చికిత్స పొందుతున్నాడు. మృతురాలి చిన్నకుమారుడు సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

అనుమానాస్పదంగా డ్రైవర్..

- గుర్వాయిగూడెంలో ఘటన

దమ్మపేట, జూన్24: అనమానాస్పదంగా డ్రైవర్ మృతి చెందిన ఘటన గురువాయిగూడెం గ్రామంలో సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..వారం రోజుల క్రితం చత్తీస్‌గఢ్ నుంచి తిరుచునాపల్లికి రైలు పట్టాల లోడుతో బయలు దేరిన ట్రాలి లారీ గుర్వాయిగూడెం గ్రామ సమీపంలో ప్రమాదవశాత్తూ పట్టాలు జారీ లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయి డ్రైవర్ మృతి చెందిన ఘటన విధితమే. ప్రమాదానికి గురైన లారీని తీసుకువెళ్లేందుకు చత్తీస్‌గఢ్ నుంచి హరిజిత్ సింగ్ అనే డ్రైవర్ (50) గుర్వాయిగూడెం గ్రామానికి ఆదివారం సాయంత్రం వచ్చాడు. ప్రమాదం జరిగిన లారీ సమీపంలో పక్కనే ఉన్న ఇంటిలో రాత్రి భోజనం చేసి నిద్రపోయాడు. సోమవారం ఉదయం ఇంటి కుటుంబ సభ్యులు డ్రైవర్‌ను నిద్ర లేపేందుకు ప్రయత్నించగా, లేవకపోవడంతో స్థానికులతో కలిసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని, స్థానిక డాక్టర్‌తో పరిశీలించగా మృతి చెందినట్లుగా ధ్రువీకరించారు. అనుమానాస్పద మృతిపై ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డిని వివరణ కోరగా తమ ప్రాథమిక విచారణలో గుండెపోటుతో మృతి చెందినట్లుగా తెలిసిందన్నారు. బంధువులకు సమాచారం ఇచ్చామని పేర్కొన్నారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తామన్నారు.

రైల్వే ట్రాక్ దాటుతూ వ్యక్తి..

ఖమ్మంక్రైం, జూన్24: రైల్వేట్రాక్ దాటుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం ఉదయం నగర పరిధిలోని రైల్వేట్రాక్‌పై జరిగింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. ఖమ్మం నుంచి మల్లెమడుగు వెళ్లే రైల్వేట్రాక్‌పై సుమారు 35 ఏళ్ల వయస్సున్న గుర్తు తెలియని వ్యక్తి ట్రాక్ దాటుతూ రైలు కింద పడి మృతి చెందాడని సిబ్బంది రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలిచారు. ఎటువంటి ఆధారాలు లభించకపోవడంతో మృతదేహాన్ని అన్నం శ్రీనివాసరావు సహకారంతో ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించినట్లు జీఆర్పీ ఎస్ఐ భాస్కరరావు తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

ఖమ్మంక్రైం, జూన్24: వ్యక్తి అదృశ్యంపై ఖమ్మం అర్బన్ పోలీసుస్టేషన్‌లో సోమవారం రాత్రి కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలప్పేటతండాకు చెందిన ధరావత్ వెంకన్న (40) అనే వ్యక్తి ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 17న వెంకన్న ఇంటిలో ఉన్న పిల్లలకు తిరుపతి వెళుతున్నానని చెప్పి, ఇంటిలోని రూ.2లక్షలు, దుస్తులు తీసుకెళ్లాడు. తర్వాత అతడి ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో వెంకన్న భార్య ప్రమీల అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'సకిని'కి కన్నీటి వీడ్కోలు

- అధికార లాంఛనాలతో నిర్వహించాలని కుటుంబ సభ్యుల డిమాండ్
- వీలుకాదని సర్దిచెప్పిన భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

మణుగూరు, జూన్ 24: అనారోగ్యంతో మృతి చెందిన కంచుమేళం కళాకారుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత సకిని రామచంద్రయ్య అంత్యక్రియలు సోమవారం మణుగూరు మండలంలోని ఆయన స్వగ్రామం కూనవరంలో గిరిజన సంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు. తొలుత రామచంద్రయ్య అంత్యక్రియలను అధికార లాంఛనాలతో నిర్వహించాలని కుటుంబ సభ్యులతో పాటు, ఆదివాసీ సంఘాల నాయకులు, ఆదివాసీ టీచర్స్ సంఘాల సభ్యులు, పలుసంఘాలు, పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. రామచంద్రయ్య పార్థివదేహాన్ని సందర్శించేందుకు వచ్చిన భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుతో ఈ విషయమై కుటుంబ సభ్యులు ఆదివాసీ నాయకులతో పాటు బీజేపీ నాయకులు పోడియం నరేందర్ తదితరులు మాట్లాడారు. దేశం గర్వించదగ్గ గిరిజన ముద్దుబిడ్డ సకిని రామచంద్రయ్య అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో జరిపించకపోవడం సరికాదన్నారు. అయితే ఈ విషయంపై తాను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని సంప్రదించానని, అందుకు అవకాశం లేకపోవడంతో సంప్రదాయ పద్ధతిలోనే అంత్యక్రియలు నిర్వహించాలని సంఘాల ప్రతినిధులకు ఎమ్మెల్యే వెంకట్రావు నచ్చచెప్పారు. రామచంద్రయ్యకు గత ప్రభుత్వం ప్రకటించిన కొత్తగూడెంలో ఇంటి స్థలం, రూ.కోటి గౌరవ పారితోషకం ఆయన కుటుంబానికి అందేలా శాయశక్తులా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో కుటుంబ సభ్యులు, బంధువులు, ఆదివాసీ సంఘాల నాయకులు శాంతించారు.

ఇదిలా ఉండగా భద్రాచలం ట్రైబర్ వెల్ఫేర్ సొసైటీ అధికారులు... భద్రాద్రి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అంత్యక్రియల ఖర్చుల మేరకు రూ.20 వేలను రామచంద్రయ్య కుమారుడు బాబూరావుకు అందజేశారు. ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, టీచర్స్ అసోసియేషన్ సంఘ నాయకులు సోమేశ్వరరావు, బాలు, సుబ్బలక్ష్మి తదితరులు ఈ వితరణను బాబూరావుకు అందించారు. రామచంద్రయ్యకు నివాళ్లు అర్పించిన వారిలో సీపీఐ రాష్ట్ర నేత బి. అయోధ్య, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు, మణుగూరు వైస్ ఎంపీపీ కేవీరావు, జడ్పీటీసీ సభ్యుడు పోశం నర్సింహారావు, పుచ్చకాయాల శంకర్, ముత్తినేని వాసు, రాము, వహీద్, గోపయ్య గొంది వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.


సకిని మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్

బొగ్గుబ్లాక్‌ల ప్రైవేటీకరణపై దశలవారీ ఆందోళనలు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని


మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని

రుద్రంపూర్, (సింగరేణి)జూన్ 24: కేంద్ర ప్రభుత్వం బొగ్గుబ్లాక్‌లను ప్రైవేటీకరించడాన్ని నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో దశలవారీ ఆందోళనలు నిర్వహించేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. కేంద్ర బొగ్గుమంత్రిత్వశాఖ మంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యలు సింగరేణి సంస్థ మనుగడకు ప్రమాదం కలిగించేలా ఉన్నాయని ఆరోపించారు. భద్రా ద్రి జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే దేశ వ్యాప్తంగా అనేక బొగ్గుబ్లాక్‌లను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టిందని ఆరోపించారు. సింగరేణిలోని కోయగూడెం ఓపెన్‌కాస్ట్‌ను అరబిందో కంపెనీకి అప్పచెప్పిన కేంద్రం మరిన్ని బ్లాక్‌లను సైతం ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేసేలా వ్యవహరిస్తోందని విమర్శించారు. సింగరేణి సంస్థ మనుగడ కోసం బొగ్గుబ్లాక్‌లను భేషరత్తుగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. గుజరాత్, ఒడిశా రాష్ట్రాల్లో ప్రభుత్వమే బొగ్గు బ్లాక్‌లను నిర్వహిస్తుండగా సింగరేణిలో మాత్రం ప్రైవేట్ వ్యక్తుల ద్వారా టెండర్లు ఆహ్వానించడం ఏమిటని ప్రశ్నించారు. దీని పై ఈ నెల 28న జరిగే సీపీఐ కౌన్సిల్ సమావేశంలో చర్చించి భవిష్యత్ కార్యచరణ ప్రకటిస్తామని తెలిపారు. సమావేశంలో సీపీఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, నాయకులు సలిగంటి శ్రీనివాస్, చంద్రగిరి శ్రీనివాస్, దుగ్గరాశి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావాణి అర్జీలకు ప్రాధాన్యత ఇవ్వాలి'

ఖమ్మంకార్పొరేషన్, జూన్24: ప్రజావాణిలో స్వీకరించిన అర్జీలకు ప్రాధాన్యతను ఇచ్చి, సత్వరమే వాటిని పరిష్కరించాలని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ కోరారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుం చి అర్జీలను స్వీకరించారు. కాగా భూసమస్యలపైనే ఎక్కువగా ఫిర్యాదులు వచ్చాయి.


అర్జీలను స్వీకరిస్తున్న అధికారులు

ప్రజావాణిలో వచ్చిన అర్జీలలో వివిధ శాఖలకు సంబంధించి 328 ఉన్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదేశించారు. ప్రజావాణి సందర్భంగా వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. పెండింగ్ దరఖాస్తులను పరిశీలించారు. సమావేశంలో డీఆర్‌డీవో సన్యాసయ్య, డీఆర్‌వో రాజేశ్వరి, జడ్పీ సీఈవో వినోద్, అధికారులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న డ్రైవర్, కండక్టర్

- 12 గ్రాముల బంగారపు బ్రాస్లెట్ బాధితుడికి అందజేత

ఖమ్మం ఖానాపురంహవేలి జూన్ 24: ఖమ్మం ఆర్టీసీ డిపోకు చెందిన కండక్టర్ మల్లికాంబ, డ్రైవర్ లక్ష్మయ్యలు బస్సులో దొరికిన 12 గ్రాముల బంగారపు బ్రాస్లెట్‌ను శుక్రవారం డిపో మేనేజర్ శ్రీనివాసరావుకు అప్పగించి మానవత్వం చాటుకున్నారు. ఖమ్మం నుంచి భద్రాచలం వెళ్లే బస్సులో ప్రయాణికుడు భాస్కర్ తన బ్రాస్లెట్‌ను పోగొట్టుకోగా, అది కండక్టర్, డ్రైవర్‌లు చూసి భద్రపరిచి డీఎంకు అందించారు. దీంతో విచారించిన అనంతరం ప్రయాణికుడు భాస్కర్‌కు సోమవారం డీఎం ఆ బ్రాస్లేట్‌ను ఖమ్మం డిపో ఆవరణలో అందించారు.


బ్రాస్లెట్‌ను డీఎంకు అందిస్తున్న డ్రైవర్, కండక్టర్

ఇరువర్గాల మధ్య ఘర్షణ : ఆరుగురిపై కేసు నమోదు

జూలూరుపాడు, జూన్ 24: ఇరువర్గాల వారు పరస్పరం దాడులు చేసుకున్న సంఘటనలో ఆరుగురిపై జూలూరుపాడు పోలీస్‌స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. టేకులపల్లి మండలం రామచంద్రునిపేట గ్రామానికి చెందిన చింతల కుమారస్వామి జూలూరుపాడు మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన తాటి వైష్ణవిలు ఐదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. భార్యభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో గత కొన్ని నెలల నుంచి వైష్ణవి ఇద్దరు పిల్లలతో కలసి రామచంద్రపురంలోని పుట్టింటి వద్దనే ఉంటుంది. కాగా తన భార్యను తీసుకొని వెళ్లేందుకు భర్త కుమారస్వామి పెద్ద మనుషులను తీసుకొని ఆదివారం రామచంద్రాపురం గ్రామానికి వచ్చారు. ఇరువర్గాలకు చెందిన పెద్ద మనుషులు పంచాయతీ నిర్వహిస్తున్న క్రమంలో భార్యభర్తల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ క్రమంలో వైష్ణవికి వరసకు బావ అయిన సరెం నాగరాజుపై బ్లేడుతో కుమారస్వామి మెడపై దాడి చేసి గాయపరిచాడు. దీంతో భార్య వైష్ణవి, ఆమె బావ నాగరాజుతో పాటు మరో ముగ్గురు బంధువులు కలసి కుమారస్వామిపై దాడి చేశారు. ఈ సంఘటనలో అతడికి తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కుమారస్వామితో పాటు మరో ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌తిరపతిరావు తెలిపారు.

కొబ్బరికాయ కొట్టి.. ఆపై హుండీ చోరీ

- రేపల్లెవాడలో ఘటన

చంద్రుగొండ, జూన్ 24: దేవుడు అంటే భయమో, భక్తియో కాని కొబ్బరికాయ కొట్టి ఆపై హుండీ దొంగతానికి పాల్పడారు దొంగలు. ఈ ఘటన మండల పరిధిలోని రేపల్లెవాడలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామం మధ్యలో ఉన్న శ్రీ సీతారాముల ఆలయంలోకి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి ప్రాంగణంలో ఉన్న హుండీని ఎత్తుకు పోయారు. ఎత్తుకుపోయిన హుండీని గ్రామ శివారులోని పొలాల్లో పగలగొట్టి అందులో ఉన్న సుమారు రూ.50 నుంచి 60 వేలను ఎత్తుకెళ్లారు. గ్రామస్థుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. కాగా చోరీ జరిగి సంఘటన కంటే, పూజలు చేసి కొబ్బరికాయ కొట్టి హుండీ ఎత్తుకు పోవడంపైనే గ్రామస్థులు ఆశ్చర్యంగా, ఆసక్తిగా చర్చించుకుంటున్నారు.


హుండీని పొలాల్లో పడేసిన దృశ్యం


గంజాయి కేసులో నిందితులకు 10ఏళ్ల జైలు

ఖమ్మం లీగల్, జూన్ 24: గంజాయి కేసులో నిందితులైన ఖమ్మం పట్టణానికి చెందిన పడిమల శివ, బానోత్ లక్ష్మణ్, సంగెపు భాస్కర్‌లకు 10 ఏళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు, నిందితులకు రూ.50వేల జరిమానా విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు జిల్లా న్యాయాధికారి కె.ఉమాదేవి సోమవారం తీర్పుచెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. 2022 మార్చి 28న ఖమ్మం పట్టణంలోని శ్రీశ్రీసర్కిల్ వద్ద ఖమ్మం-1 ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా, నిందితులు ద్వి చక్ర వాహనంపై తరలిస్తున్న 4 కేజీల గంజాయిని వారివద్ద నుంచి స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. అట్టి కేసును విచారించిన న్యాయాధికారి నిందితులపై నేరం రుజువు కావడంతో పైవిధంగా తీర్పుచెప్పారు. ప్రాసిక్యూషన్ తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎ.శంకర్ వాదించగా, లైజనింగ్ అధికారి కె.మోహన్‌రావు, కోర్టు కానిస్టేబుల్ టి.మారేశ్వర్‌రావు, హోంగార్డు యం.డి.ఆయ్యూబ్‌లు సహకరించారు.

బాలికపై అత్యాచారయత్నం

బూర్గంపాడు, జూన్ 24: బాలికపై అత్యాచారయత్నం ఘటనపై బూర్గంపాడు పోలీసు స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామంలో మూడేళ్ల బాలిక ఇంటి బయట ఆడుకుంటూ ఉండగా, బీహార్ రాష్ట్రానికి చెందిన కండ్రామ్ తినుబండారాలు ఆశ చూపించి లైంగిక దాడికి యత్నించాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ సుమన్ వెల్లడించారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట
8
భద్రాద్రి
కొత్తగూడెం
మంగళవారం 25 జూన్ 2024



ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించిన జడ్పీ చైర్మన్

బూర్గంపాడు, జూన్ 24: బూర్గంపాడు మండల పరిషత్ కార్యలయాన్ని సోమవారం జిల్లా పరిషత్ చైర్మన్ కంచర్ల చంద్ర శేఖర్‌రావు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందితో సమావేశమై కార్యాలయ సమస్యలను తెలుసుకున్నారు. కార్యలయంలో ఖాళీ అయిన అటెండర్ పస్టులను తక్షణమే నియామకాలు జరుపుతామని హమీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేజర్ గ్రామపంచాయతీలలో, ప్రజల రద్దీ ఎక్కువగా ఉన్న ప్రదేశాలలో సామూహిక మరుగుదొడ్ల నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు ఇవ్వనున్న నేపథ్యంలో వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజల ఆరోగ్యం కాపాడటానికి తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జమలా రెడ్డి, ఎంపీవో సునీల్‌కుమార్, సూపరింటెండెంట్ రవీందర్, ఏపీవో విజయలక్ష్మీ, సీనియర్ అసిస్టెంట్ రఘు, టైపిస్ట్ మాధవి, కార్యలయ, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

రూ.124.48 కోట్లతో నిర్మాణ పనులు

27న మంత్రులతో శంకుస్థాపన

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వెల్లడి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కూనంనేని

కొత్తగూడెం టౌన్, జూన్ 24: మున్సిపల్ పరిధిలోని 36వార్డుల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం రూ. 124.48కోట్లను మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. పట్టణంలోని అన్ని ప్రాంతాలకు నీటి ఎద్దడి లేకుండ చర్యలు తీసుకుంటున్నట్లు వారు వివరించారు. సోమవారం తాటిపల్లి రెసిడెన్సిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 27వ తేదీన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంఖుస్థాపన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శంఖుస్థాపనకు రాష్ట్ర డిప్యూటి ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కోమటరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్రమంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుతోపాటు పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి, వద్దిరాజు రవిచంద్రలు హాజరుకానున్నట్లు తెలిపారు. కొత్తగూడెం, పాల్వంచ పట్టణాల అభివృద్ధి కోసం కృషిచేస్తున్నట్లు తెలిపారు. అంతర్గత రహదారులు, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చడం, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వానికి 52అంశాలపై నివేదికను అందచేయడం జరిగిందని తెలిపారు. రూ.4 కోట్ల వ్యయంతో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కొత్తగూడెం నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలపడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. మంత్రుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపాలిటీలో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌తోపాటు బైపాస్ రోడ్ల నిర్మాణానికి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పట్టణంలోని సేయింట్‌మేరీస్ పాఠశాల సమీపంలో వరదనీరు రోడ్లపై నిల్వ లేకుండ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు సక్రమంగా ఉండే విధంగా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, కౌన్సిలర్లు కంచర్ల జమలయ్య, భూక్య శ్రీనివాస్, ధర్మరాజు, విజయ్‌కుమార్, సత్యనారాయణచారి, కాసుల ఉమారాణి, విజయలక్ష్మి, మునిగడప పద్మ, బండి నర్సింహారావు, అనీల్, సత్యనారాయణ చారి, సత్యభామ, ఆమని, వేణు, ప్రసాద్, నాయకులు కంభంపాటి దుర్గా ప్రసాద్, భీమా శ్రీధర్, మసూద్, రావిరాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ దరఖాస్తును పరిశీలించాలి

ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్



ప్రజావాణిలో సమస్యను వింటున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కొత్తగూడెం, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీవోసీ కార్యాలయ సమావేశ మందిరంలో అన్నిశాఖల అధికారులతో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు సిఫార్సు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ దరఖాస్తు చేసిన అభ్యర్థులను వివరాలు అడిగి తెలుసుకుని పరిష్కారానికి చర్యలుచేపట్టాలని శాఖల వారీగా అధికారులను ఆదేశించారు. గుండాల మండలం కాచనపల్లి గ్రామానికి చెందిన కుంజ వెంకయ్య కాంచనపల్లి గ్రామంలో సర్వే నెంబరు 55/18లో గల వ్యవసాయ భూమి తనకు అప్పగించాలని, జడ్జిమెంట్లు వచ్చాయని దీని విషయంలో తగు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేయగా కలెక్టర్ గుండాల తహసీల్దార్‌కు సిఫార్సు చేశారు. ములకలపల్లి మండలం పొగళ్లపల్లి గ్రామ రెవిన్యూ పరిధి తాళ్లపాయి పంచాయతీ బూర్గుకోయగుంపు గ్రామంలో 17మంది రైతులకు గత 40 సంవత్సరాల క్రితం ఫైనల్ పట్టాలు ఇచ్చారు.. వీటిని సర్వే నెం: 300/1/1 గతంలో సర్వేప చేసి కొంతమందికి పట్టాలు ఇచ్చారు. మిగతా వారికి సర్వే చేయలేదని, తాజాగా ఇక్కడ శాటిలైట్ సర్వే నిర్వహించడగ ఫారెస్ట్ పట్టా అని చూపిస్తుందని మళ్లీ సర్వే చేసి పట్టాలు మంజూరు చేయాలని పలువురు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా ములకలపల్లి తహసిల్దార్‌కు ఎండర్స్ చేశారు. జూలూరుపాడు గ్రామం నివాసి షేక్ రహీం మున్నీ (58) భర్తకు గుండె ఆపరేషన్ అయి ఏడు సంవత్సరాలైందని ఈ నేపథ్యంలో కుటుంబపోషణ భారంగా మారిందని ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కడైన స్వీపరుగా పని చేసే అవకాశం కల్పించాలని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై కలెక్టర్ స్పందించి జిల్లా విద్యాశాఖాధికారికి సిఫార్సు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు మధు, దామోదర్‌రావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

డ్రోన్ల పని తీరు పరిశీలన

గోదావరి వరదల నుంచి ప్రజలను రక్షించేందుకు ఈ సారి సరికొత్తగా వినియోగించనున్న అగ్రికల్చర్ డ్రోన్ల పని తీరును కలెక్టర్ జితేష్ పాటిల్ సోమవారం ఐడీఓసీ ప్రాంగణంలో పరిశీలించారు. ఖమ్మం నుంచి ప్రత్యేకంగా తెప్పించిన డ్రోన్ పని తీరుపై డెమో విధానాన్ని, పలువురు గజ ఈతగాళ్ల వరదల సమయంలో చేపట్టనున్న రక్షణ చర్యలను కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరదలు తాకిడి అధికంగా ఉంటుందని, ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా డ్రోన్లను అందుబాటులో ఉంచుతామని తెలిపారు.

కిషన్‌రెడ్డిని కలిసిన బీఎంఎస్ నాయకులు



శుభాకాంక్షలు తెలుపుతున్న బీఎంఎస్ నాయకులు

రుద్రంపూర్, (సింగరేణి) జూన్ 24 : కేంద్ర బొగ్గుమంత్రిత్వశాఖ మంత్రి కిషన్‌రెడ్డిని సింగరేణి కోల్‌మైన్స్ కార్మికసంఘ్ (బీఎంఎస్) ప్రతినిధి బృందం సోమవారం హైదరబాద్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సింగరేణిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. సింగరేణి సంస్థ అభివృద్ధి కోసం నూతన ప్రాజెక్టులను ప్రారంభించేవిధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షులు మొగిలిపాక రవి, నాగ ప్రసాద్, కాసర్ల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌ను ముట్టడించిన అంగన్‌వాడీలు



నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

కొత్తగూడెం, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలకు వేతనాలు పెంచి, పప్పు, నూనె, గుడ్లు, పాలు సకాలంలో అందించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగిన అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఎఐటీయూసీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు కలెక్టరేట్‌ను ముట్టడించి నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఐసీడీఎస్‌లో 1975 నుంచి గౌరవ వేతనం పేరుతో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ చేస్తున్నారని చాలీచాలని తక్కువ వేతనం పొందుతూ కుటుంబ పోషణ భారంగా జీవితాలను వెళ్లదీస్తున్నారని అన్నారు. అంగన్‌వాడీ టీచర్లకు కనీస వేతనం రూ. 26,000,న హెల్పర్స్‌కు రూ.21,000 ఇవ్వాలని గత అనేక ఏళ్లుగా పోరాటం చేస్తున్నారని, గత ప్రభుత్వ హయంలో 24రోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా చేసిన సమ్మెలో భాగంగా అంగన్‌వాడీ టీచర్లకు రూ. 18000లు, హెల్పర్లకు రూ. 15,000 ఇస్తామని గత ప్రభుత్వం హామీ ఇచ్చిందని ఈనాటి ప్రభుత్వం కూడా అధికారంలో రావడంతోవేతనంపై విధంగా పెంచుతామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇంటి అద్దెలు, గ్యాస్ బిల్లు, ఆరోగ్య లక్ష్మి బిల్లు ఇవ్వాలని అదనపు యాప్సను బీఎల్‌వో డ్యూటీ రద్దు చేయాలని, తాగునీరు, కరెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెను మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు.

సొసైటీ ఎన్నికల్లో సత్తా చాటాలి



ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

రుద్రంపూర్, (సింగరేణి) జూన్ 24: సింగరేణి కొత్తగూడెం ఏరియా వర్క్‌షాపు క్రెడిట్ సొసైటీ ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ ప్యానల్ విజయం కోసం ఐఎన్‌టీయూసీ నాయకులంతా సత్తా చాటాలని ఆ యూనియన్ కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షులు ఎండి. రజాక్ కోరారు. సోమవారం రుద్రంపూర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నెల 26వ తేదీన సొసైటీ ఎన్నికలు జరగనున్నాయని, ఏడు డైరెక్టర్ స్థానాలకు ఐఎన్‌టీయూసీ అభ్యర్థులను బరిలో నిలిపినట్లు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు సత్తార్‌పాషా, గోపు కుమార్, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో 'లిటిల్ ఫ్లవర్స్' ప్రతిభ



జ్ఞాపికలతో విద్యార్థులు

భద్రాచలం, జూన్ 24: ఇంటర్ ఇంప్రూవ్‌మెంటు ఫలితాల్లో రాష్ట్రస్థాయి ర్యాంకులను భద్రాచలంకు చెందిన లిటిల్ ఫ్లవర్స్ విద్యార్థులు సాధించారు. ఎంపీసీ విభాగంలో ఎండి తపస్సుము 468 మార్కులు, బాజీ మోక్షిత 468, నలజాల లిఖిత 468 మార్కులతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మొదటిస్థానంతో పాటు స్టేట్ సెకండ్ ర్యాంకును కైవసం చేసుకున్నారు. బైపీసీ విభాగంలో ఒంటెద్దు గ్లోరీ 440కి 438 మార్కులతో రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచారు.

బారులుదీరిన నిరుద్యోగ అభ్యర్థులు



దరఖాస్తు చేసుకుంటున్న అభ్యర్థులు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూన్ 24: కొత్తగూడెం ప్రభుత్వ వైద్య కళాశాలలో అవుట్ సోర్సింగ్ పోస్టులకు గాను దరఖాస్తు చేసుకునేందుకు ఐడివోసీలో నిరుద్యోగ అభ్యర్థులు సోమవారం బారులు తీశారు. మొత్తం 23 కేటగిరిలో 155 పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరించు కార్యక్రమాన్ని పది కౌంటర్లను ఏర్పాటు చేసి జిల్లా ఉపాధి కల్పన అధికారి కార్యాలయ సిబ్బంది స్వీకరిస్తున్నారు. భారీగా నిరుద్యోగ అభ్యర్థులు బారులు తీరడంతో ఐడీవోసీ కిక్కిరిసిపోయింది. రాత్రి 8 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించారు. మంగళవారం దరఖాస్తు ప్రక్రియకు చివరి తేదీ కావడంతో నిరుద్యోగ అభ్యర్థులు భారీగా తరలి రానున్నారు. మొత్తం ఇప్పటి వరకు 3500ల దరఖాస్తులు వచ్చాయని, వీటి సంఖ్య రెట్టింపు అయ్యే అవకాశం ఉందని తెలుస్తుంది.

వైద్య ఆరోగ్య శాఖ పోస్టులకు 175 అభ్యంతరాలు

వైద్య ఆరోగ్య శాఖలో 73 పోస్టుల భర్తీకి గాను నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోగా తాత్కాలిక జాబితా విడుదలైంది. ఈ జాబితాలో అభ్యంతరాలు ఉంటే లిఖిత పూర్వకంగా డిఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో అందజేయాలని గత డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ శిరీష ప్రకటించారు. ఈ మేరకు 175 మంది అభ్యర్థులు లిఖిత పూర్వకంగా అభ్యంతరాలను డిఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో అందజేసినట్లు కార్యాలయ ఏవో మోహన్ సోమవారం తెలిపారు. 73 పోస్టుల భర్తీకి అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఎంపిక చేయనున్నారు.

కేసీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే మెచ్చా



దమ్మపేట, జూన్ 24: ప్రభుత్వం పోయినా అధైర్య పడవద్దని మాజీ సీఎం కేసీఆర్, అశ్వారావుపేట ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వర రావుకు సూచించారు. కేసీఆర్‌ను హైద్రాబాద్‌లో సోమవారం మర్యాద పూర్వకంగా మెచ్చా కలిశారు. ఈ సందర్భంగా అశ్వారావుపేట నియోజకవర్గ అభివృద్ధిపై ఆరా తీసారు. అప్పుడే అభివృద్ధి పనులు చాలా పూర్తయ్యాయని, కొన్ని పనులు మాత్రమే పూర్తికాలేదని ఆగిపోయినట్లు కేసీఆర్ దృష్టికి తీసుకు వెళ్లినట్లు మెచ్చా తెలిపారు. అభివృద్ధికి కోట్ల రూపాయిలు ఇచ్చిన కేసీఆర్‌కు మెచ్చా కృతజ్ఞతలు తెలిపారు.

ఇద్దరు దొంగల అరెస్ట్

అశ్వాపురం, జూన్ 24: తాళం వేసిఉన్న ఇళ్లను టార్గెట్ చేస్తూ దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను అశ్వాపురం పోలీసులు ఆదివారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. అవ్వాపురం సీఐ అశోక్‌రెడ్డి సోమవారం వివరాలను తెలియజేశారు. పట్టుబడిన నిందితులు మణుగూరు విఠల్‌రావు నగర్‌కు చెందిన గంటా ప్రవీణ్‌కుమార్, జగదీష్ గుర్తించారు. వీరు ఇరువురు అశ్వాపురం, మణుగూరు, భద్రాచలం ప్రాంతాల్లో అనేక దొంగతనాలకు పాల్పడినట్లు సీఐ వివరించారు.

ప్రహరీ నిర్మాణానికి ఎంపీపీ భూమిపూజ

అశ్వాపురం, జూన్ 24: మండల పరిధిలోని బీజీ కొత్తూరు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి సోమవారం ఎంపీపీ ముత్తినేని సుజాత భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో అన్ని గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా అభివృద్ధిపనులకు నిధులు కేటాయించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మొండికుంట ఎంపీటీసీ కమటం నరేష్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, సొసైటీ డైరెక్టర్ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

సత్యం స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు



మాట్లాడుతున్న కాసాని అయిలయ్య

సుజాతనగర్, జూన్ 24: చింతలపూడి సత్యం స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్మిద్దామని సీపీఎం రాష్ట్ర నాయకుడు కాసాని అయిలయ్య, జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అన్నారు. సోమవారం మండలంలోని చింతలపూడి సత్యం స్థూపం వద్ద 30వ వర్ధంతి సభ, సీపీఎం మండల కార్యదర్శి వీర్ల రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చింతలపూడి సత్యం 1980 దశకం నుంచి ఈ ప్రాంతంలో వ్యవసాయ కూలీలు పడుతున్న బాధలను గుర్తించి కూలీ రేట్ల పెంపుదలకు జరిగిన పోరాటంలో 25 రోజుల పాటు జైలు శిక్షకు గురయ్యారని అన్నారు. అదే విధంగా సింగభూపాలెం ప్రాజెక్ట్ మరమ్మతులు చేయాలని, ఆయకట్టు చివరి భూముల వరకు నీరందాలని దీక్ష చేసి సాధించిన వ్యక్తి అని, సీపీఎం పార్టీ చేపట్టిన ప్రతి ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని, ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ధర్మ, శివరామ కృష్ణ, భాస్కర్, శంకర్, నరేష్, సాయి, భాగ్యలక్ష్మి, వేణు, పుల్లయ్య, కొండే కృష్ణ, ఊడుగుల శ్రీకాంత్, బాలు వెంకటేశ్వర్లు, మద్దెబోయిన గోవర్ధన్, వీర్ల సత్యం తదితరులు పాల్గొన్నారు.

పోడుసాగుదారుల జోలికి వస్తే సహించను



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

పాల్వంచ రూరల్, జూన్ 24: ఏజెన్సీ ప్రాంతంలో పోడుసాగుదారుల జోలికి ఫారెస్ట్ అధికారులు వస్తే సహించనని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం మండలంలోని ఉల్వనూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదల సాగులో ఉన్న పోడుభూములకు హక్కు కల్పించడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. ఫారెస్ట్ అధికారులు కవ్వింపు చర్యలు మానుకోవాలని చెప్పారు. ప్రజాక్షేత్రంలో ఉంటూ ప్రజలకు పని చేయడమే తన ధ్యేయమన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ముందుంటానని చెప్పారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా నాయకులు ముత్యాల విశ్వనాథం, చంద్రగిరి శ్రీనివాస్, మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, నాయకులు ఉప్పుశెట్టి రాహుల్, కిరణ్, శ్రీను, ఇట్టి వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.

నోట్ బుక్స్ పంపిణీ

పాల్వంచ టౌన్, జూన్ 24: వాసవి, వనిత క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం చిన్న సరస్వతి శిశుమందిర్ పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిల్స్, ఎరైజర్స్, స్వీట్స్ పంపిణీ చేశారు. ఒకరోజు 12 గంటలు నిర్విరామ సేవా కార్యక్రమాల్లో భాగంగా సోమవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు క్లబ్ బాధ్యులు చలువాది ప్రకాష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ మాజేటి రామచంద్రరావు, ఇంటర్నేషనల్ కో ఆర్డినేటరు రోజాలక్ష్మి, సతీష్, శ్రీనివాసరావు, శ్రీనివాస్, దుర్గ, ఇందిర, రామలింగేశ్వరరావు, చంద్రశేఖర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూన్ 24: భద్రాద్రి జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన జితేష్ వి పాటిల్‌ను కాంగ్రెస్ నాయకులు కోనేరు సత్యనారాయణ(చిన్ని), తదితరులు సోమవారం ఐడీవోసీలో మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లాలో నెలకొన్న సమస్యలపై స్పందించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. వాటిలో ముఖ్యంగా 76 జీవో క్రమబద్ధీకరణ ఏర్పాటు, బైపాస్ రోడ్డు నిర్మాణం, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ సముదాయ నిర్మాణం, కిన్నెర సాని తాగు నీరు సరఫరాలో పలు సమస్యలు వంటివి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళారు. తప్పక జిల్లా అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట దేవిప్రసన్న, నాయకులు రావి రాంబాబు, మసూద్, శారద, అనిత, యశోద, దివ్యా తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలి



నియామకాలు పొందిన వారితో జీఎం

రుద్రంపూర్, (సింగరేణి) జూన్ 24: సింగరేణి సంస్థలో కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు సంస్థ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలని సింగరేణి కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజరు షాలెం రాజు కోరారు. సోమవారం కారుణ్య నియామకాల ద్వార సింగరేణి సంస్థలో చేరిన వారికి 18మందికి నియామకపత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ క్రమశిక్షణతో విధులు నిర్వహించి సంస్థ అభివృద్ధికి పాటుపడాలని, సింగరేణి సంస్థలో కార్మికుల వారసులుగా చేరిన అభ్యర్థులంతా అంకిత భావంతో విధులు నిర్వహించాలన్నారు. కంపెనీలో బదిలీ వర్కరుగా చేరిన అభ్యర్థులు విద్యార్హతలను బట్టి అంతర్గత పరీక్షలను అర్హత సాధించి ప్రమోషన్లు సైతం పొందే అవకాశం ఉందన్నారు.

ఆటోను ఢీకొన్న కారు



సంఘటన వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ రహమాన్

చుంచుపల్లి, జూన్ 24: జాతీయ రహదారిపై వెళ్తున్న ఒక కారు ప్రమాదవశాత్తు ప్యాసింజర్ ఆటోను ఢీకొన్న సంఘటన కొత్తగూడెం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. టూటౌన్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయవాడ - జగదళ్‌పూర్ జాతీయ రహదారిలో రుద్రంపూర్ ఫిల్టర్ బెడ్ వద్ద పెనగడప పీహెచ్‌సీలో డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న నేహాఅబ్రీన్ కారు ఈ ప్రమాదానికి కారణమైంది. ఈ డాక్టర్ కారు కొత్తగూడెం వెళ్తున్న క్రమంలో చంద్రుగొండ వెళ్తున్న ప్యాసింజర్ ఆటోను ప్రమాదవశాత్తు ఢీకొంది. ఈ ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు ప్యాసింజర్లకు గాయాలు అయ్యాయి. ఈ క్షత గాత్రుల్లో రాంపురం గ్రామానికి చెందిన ధనలక్ష్మీకి తీవ్ర గాయాలు అయి పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. ఈ సమాచారం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు, డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ ప్రమాదం జరిగిన ప్రదేశానికి వెళ్ళారు. ప్రమాదం జరిగిన సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. తరచూ ఈ రహదారిపై ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో రక్షణ చర్యలు చేపట్టే ప్రతిపాదనలను తక్షణమే తనకు అందజేయాలని పోలీసులను ఆదేశించారు. ఈ సంఘటనపై టూ టౌన్ ఎస్ఐ సెల్వరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

కరకగూడెం, జూన్ 24: ఉపాధి హామీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను తక్షణమే విడుదల చేయాలని సీపీఎం పార్టీ మండల కార్యదర్శి కొమరం కాంతారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కరకగూడెంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ కార్మికులు వేసవి కాలంలో మండు వేసవి తట్టుకొని ఉపాధి హామీ పనిచేస్తుంటే గతంలో మాదిరిగా వేసవి భత్యం గడ్డపార, మంచినీరు లాంటి చార్జీలు మొత్తం చెల్లించేవారని ప్రస్తుతం వాటిని తీసేసి ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. చేసిన పనికి బిల్లులు చెల్లించకుండా కాలయాపన చేస్తుందని ఆరోపించారు. తక్షణమే పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బిల్లులు రాక ఉపాధి కూలీలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఊకె నరసింహారావు పాల్గొన్నారు.